ప్రజాశక్తి
ఆదివారం 16 ఏప్రిల్ 2023 8 పేజీలు
ఎన్‌టిఆర్ కృష్ణా





మతోన్మాద బిజెపిని తరిమికొడదాం

సిపిఎం, సిపిఐ ప్రచార భేరిలో నేతలు



సత్యనారాయణపురంలో మాట్లాడుతున్న బాబూరావు



చిట్టినగర్లో మాట్లాడుతున్న కె.రామకృష్ణ

ప్రజాశక్తి - వన్‌టౌన్, విజయవాడ : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశ ప్రజల మధ్య మతవిద్వేషాలు రెచ్చగొట్టి మెజార్టీ ప్రజల ఓట్లు కొల్లగొట్టి తన అధికారాన్ని సుస్థిరం చేసుకునేందుకు ప్రయత్నిస్తోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ అన్నారు. మైనార్టీలను అభద్రతా భావానికి గురిచేస్తోందని, ఇలాంటి మతోన్మాద బిజెపిని తరిమికొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. 'బీజేపీ హఠావో - దేశ్ కి బచావో' నినాదంతో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రచార భేరి శనివారం విజయవాడలోని చిట్టినగర్ జోడుబొమ్మల సెంటర్, సత్యనారాయణపురం, ఊర్వశి సెంటర్లలో జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగ సమస్య పెరిగిందని, రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని, గ్యాస్, పెట్రోల్, డీజిల్, నిత్యాసరాల వస్తువులు ఆకాశన్నంటుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తాము అధికారంలో వస్తే ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లయినా ఒక్క ఉద్యోగం ఇవ్వలేదన్నారు. యువతను మోసం చేశారని విమర్శించారు. తాము అధికారంలోకొస్తే గ్యాస్ ధరలు తగ్గిస్తామని నాడు ఢిల్లీ వీధుల్లో ధర్నాలు చేసిన బిజెపి నాయకులు అధికారంలోకి వచ్చాక రూ.410 ఉన్న గ్యాస్ సిలిండర్ ధరను రూ.1200 వరకు పెంచారన్నారు. నల్లధనాన్ని తీసుకువచ్చి ఒక్కొక్కరి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామని చెప్పిన మోడీ హామీ ఏమైందని ప్రశ్నించారు. ఓట్ల కోసం అడ్డగోలు హామీలిచ్చి ప్రజల్ని మోసం, దగా చేశారని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వంలో కార్పొరేట్లకు, పెట్టుబడి దారులకు మాత్రమే లబ్ది జరిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రతి విషయంలో మోసం చేశారని మండిపడ్డారు. ప్రత్యేక హోదా ఇవ్వలేదని, విభజన హామీలు అమలు చేయలేదన్నారు. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న విశాఖ స్టీల్ ఫ్యాక్టరీని అదానీకి అప్పగించే కుట్రలకు తెరతీసారన్నారు. సిపిఎం, సిపిఐ నాయకులు మోడీ ప్రజా వ్యతిరేక విధానాలపై (మిగతా 6లో)



ఊర్వశి సెంటర్లో ప్రచార భేరిలో కాశీనాథ్ తదితరులు

ప్రచండ భానుడి భగభగలు

వడగాల్పులతో బెంబేలు

ప్రజాశక్తి - గన్నవరం : ప్రచండ భానుడి భగభగలు, వేసవి వడగాల్పులు, ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎనిమిదేళ్ల తర్వాత ఏప్రిల్‌లోనే ఈ స్థాయి ఉష్ణోగ్రతలు, వడగాల్పులు నమోదు కావడం ఇదేనని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఉమ్మడి కృష్ణాజిల్లాలో రికార్డుస్థాయిలో 43 నుంచి 44 డిగ్రీల సెంట్రీగ్రేడ్ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. విజయవాడ, మచిలీపట్నం నగరాలతోపాటు గ్రామీణ ప్రాంతాలు, నదీ, సముద్ర తీర ప్రాంతాల్లోనూ ఎండలు మండుతుండటంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఇంటిగోడలు, వస్తువులతో సహా దేన్ని పట్టుకున్నా వేడెక్కి చురుక్కుమంటున్నాయి. ఉదయం 10 గంటలకే రోడ్లన్నీ నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. గత 10 రోజులుగా కాస్తున్న ఎండలకు ఇప్పటికే వృద్ధులు, పిల్లలు కొందరు వడదెబ్బకు గురై ఇళ్లల్లో విశ్రాంతి తీసుకుంటున్న ఉదంతాలు కూడా ఉంటున్నాయి. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వస్తున్న ప్రజలు, విద్యార్థులు ఎండ దెబ్బకు హడలిపోతున్నారు. వేసవి నుంచి ఉపశమనానికి కర్బూజా, కొబ్బరి బోండాలు, చెరకు, పండ్ల రసాలు, మజ్జిగను ఆశ్రయిస్తున్నారు. తప్పనిసరైతే తప్ప ఎండవేళల్లో బయటకు రాకుండా ఉండటం మంచిదని ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరికలు జారీచేసిన విషయం తెలిసిందే.

వడగాలులతో అప్రమత్తంగా ఉండాలి : డాక్టర్ శారమ్మ

వేసవి కాలంలో మండుతున్న ఎండల పట్ల అప్రమత్తతో ఉండాలి. సాధ్యమైనంత వరకు ఉదయం 10 గంటలలోపు, సాయంత్రం 4గంటల తర్వాత ముఖ్యమైన పనులు చూసుకోవాలి. అత్యవసరమైన పనులుంటేనే మధ్యాహ్నం బయటకు రావాలి. బయటకు వెళ్లే సమయంలో తెల్లటి దుస్తులు ధరించడంతోపాటు ముఖానికి గుడ్డ కట్టుకోవాలి. మార్గమధ్యంలో కొబ్బరినీళ్ల తాగాలి. మంచినీరు అధికంగా తీసుకోవాలి. పండ్ల రసాలు, జూస్‌లు అధికంగా తీసుకుంటే శరీరంలో శక్తి పెరుగుతుంది. వడదెబ్బ నుంచి బయటపడేందుకు వీలుంటుంది. ఎండల్లో తిరిగితే ఒఆర్ఎస్ ప్యాకెట్‌ను లీటరు నీటిలో కలిపి తాగాలి. ఏదైనా ఆ రోగ్య సమస్యలుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి.





ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఆర్.రఘు



ఉపాధి హామీని నీరుగార్చే కేంద్రం కుట్రలను తిప్పికొట్టండి


వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రఘు

ప్రజాశక్తి - మొవ్వ

ఉపాధిహామీ చట్టంతోసహా పలు ప్రజోపయోగ కార్యక్రమాలను నీరుకార్చేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రఘు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం కష్ణాజిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం మొవ్వ మండలం నిడుమోలు నుండి సైకిల్ యాత్ర ప్రారంభమైంది. ఈసందర్భంగా నేతలు పని ప్రదేశాలను పరిశీలించి ఉపాధి కూలీలకు కేంద్రం చేస్తున్న అన్యాయంపై అవగాహన కల్పించారు. ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనేక కుట్రలు పన్నుతోందన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని మరింత బలోపేతం చేయాలన్ని డిమాండ్ చేశారు. కార్మికులకు 200 రోజులు పని, రూ.600 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పని ఇవ్వలేకపోతే నిరుద్యోగ భతి, అర్జీ పెట్టుకున్న అందరికీ జాబ్ కార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనికోసం జరిగే పోరాటాల్లో వ్యవసాయ కార్మికులంతా పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు.

ఈ కార్యక్రమంలో వ్యకాసం, కల్లుగీత కార్మిక సంఘం, కౌలు రైతు సంఘం, సిఐటియు జిల్లా నాయకులు శాంసన్, వాకా రామచంద్రరావు, శీలం నారాయణరావు, మహమ్మద్ కరీముల్లా, మొవ్వ మండల నాయకులు మద్దుల బసవయ్య, ఉప్పలపు వెంకటాదారు, కొనకల్ల రాంబాబు, కాకి రాజశేఖర్, కొనకల్ల తిరుపతి వెంకటేశ్వరరావు, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

వార్త మెయిన్ పేజీలో



యార్లగడ్డ రామనాథం భౌతికకాయం వద్ద కుటుంబ సభ్యులు

సిపిఎం సానుభూతిపరుడు వై.రామనాథం కన్నుమూత

తెంపల్లిలో అతిసార ?

30 మందికి అస్వస్థత మంచినీరు కలుషితం కావడమే కారణం !

ప్రజాశక్తి - గన్నవరం : గన్నవరం మండలం తెంపల్లిలో పలువురు అస్వస్థతకు గురయ్యారు. గ్రామంలోని గంగానమ్మ చెట్టు ప్రాంతంలోని రెండు చోట్ల మంచినీటి పైప్‌లైన్ పగిలిపోవడంతో నీరు కలుషితమై వాంతులు, విరోచనాల బారిన పడ్డారు. ఇప్పటికి 20 నుండి 30 మంది వరకూ అనారోగ్యంతో ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్య సేవలు పొందుతున్నారు. కొంతమంది చికిత్స పొంది తిరిగి ఇళ్లకు వస్తున్నారు. తమ పరిస్థితి బాగానే ఉందని చెబుతున్నారు. అయితే వాంతులు, విరోచనాలతో బాధపడే వారి సంఖ్య పెరుగుతోందంటున్నారు. ఎవరికివారు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకుని తిరిగి ఇళ్లకు వస్తున్నారని, ఇన్ పేషెంట్లుగా ఎవరూ ఉండడం లేదని అధికారులు తెలిపారు. గ్రామ సర్పంచ్ కొలుసు శిరీష, కార్యదర్శి నామేశ్వరరావు ఆ ప్రాంతంలో అత్యవసర పరిస్థితిని ప్రకటించి చర్యలు తీసుకుంటున్నారు. పంచాయతీ, ఆర్‌డబ్ల్యుఎస్ సిబ్బంది రంగంలోకి దిగి నీటిని పరీక్షించారు. నీరు కలుషితమైనట్లు నివేదిక వచ్చినట్లు తెలిసింది. కొలుసు శిరీష గంగానమ్మ చెట్టు ప్రాంతంలో సుమారు 100 కుటుంబాల వారి ఇళ్లకు వెళ్లే నీటి సరఫరాను నిలిపివేయించారు. పంచాయతీ సిబ్బందిని ప్రతి (మిగతా 6లో)

వార్తలు 6వ పేజీలో



బాధ్యతలు స్వీకరిస్తున్న కృష్ణాజిల్లా నూతన కలెక్టర్ పి.రాజాబాబు

కృష్ణాజిల్లాను ఉన్నత స్థానంలో నిలబెట్టేందుకు కృషి : నూతన కలెక్టర్ పి.రాజాబాబు



జిల్లాలో అభివృద్ధికి కృషి నూతన జెసి పి.సంపత్

ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డిల్లీరావును కలిసిన నూతన జెసి పి.సంపత్‌కుమార్



రంజాన్ వేళలు

వారం		వేళలు
ఆదివారం	ఇఫ్తార్	6.43
సోమవారం	సహరి	4.41

స్నేహితుడిపై బీరు సీసాతో దాడి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : ఇరువురి స్నేహితుల మధ్య మద్యం తాగి గొడవ పడిన సంఘటనలో బీరు సీసాతో పొడవగా ఒకరికి గాయం అయిన సంఘటన మండలంలోని షేర్ మొహమ్మద్ పేట క్రాస్ రోడ్ లో గల వెంకట సాయి లాడ్జిలో శనివారం జరిగింది. సేకరించిన సమాచారం మేరకు జగ్గయ్యపేటకు చెందిన గజ్జా వినోద్, చిల్లకల్లు గ్రామానికి చెందిన మరికంటి గోపీ ఇరువురు స్నేహితులు. వీరు మందు తాగుతూ మాట మాట పెరిగి వాగ్వాదానికి దిగారు. ఈ గొడవలో జగ్గయ్యపేటకి చెందిన గజ్జా వినోదుని బీరు సీసాతో చిల్లకల్లు గ్రామానికి చెందిన మరికంటి గోపి పొడిచాడు. దీంతో వినోద్ కు తీవ్ర రక్తస్రావం అయ్యింది. దీనితో లాడ్జి సిబ్బంది హుటాహుటిన జగ్గయ్యపేట ప్రభుత్వ హాస్పిటల్ కి తరలించారు. జగ్గయ్యపేట ఎస్సై రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంపలగూడెం ఎస్ఐగా రాంబాబు



ప్రజాశక్తి - గంపలగూడెం: గంపలగూడెం ఎస్సైగా పి. రాంబాబు శనివారం పదవి బాధ్యతలు చేపట్టారు. రాంబాబు మైలవరం స్టేషన్లో విధులు నిర్వహించగా ,బదిలీపై గంపలగూడెం వచ్చారు. గంపలగూడెంలో విధులు నిర్వహించిన వి. సతీష్‌కుమార్ తిరువూరు టౌన్ - 1ఎస్సైగా బాధ్యతలు స్వీకరించారు.

రెండో దశ నాడు-నేడు పనులు ప్రారంభించాలి

ప్రజాశక్తి - గంపలగూడెం : మండలంలో రెండవ దశ నాడు-నేడు పనులకు మంజూరైన నిధులను వెంటనే వినియోగించి, నిర్మాణాలు పూర్తి చేయాలని ఎన్టీఆర్ జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఉమామహేశ్వరరావు ఆదేశించారు. శనివారం ఆయన గంపలగూడెం మండలంలో ఊటుకూరు, పెనుగొలను, ఆర్లపాడు, కనుమూరు గ్రామాలలో పర్యటించి ప్రారంభం కానున్న, ప్రారంభమైన పనులను ఆయన పరిశీలించారు. అనంతరం స్థానిక ఐకెపి కార్యాలయంలో హెచ్ఎంలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, తదితరులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనుల నిర్వహణలో గతంలో గంపలగూడెం మండలం మూడో స్థానంలో ఉండగా అది నేడు 9వ స్థానానికి చేరుకోవడం దురదష్టకరమన్నారు. వెంటనే పనులు ప్రారంభించి, పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సీఎంఓ టి రాంబాబు, ఎంఈఓ బి సోమశేఖర్ నాయక్, ఎంపీడీవో వై పి రెడ్డి ,ఏఈ పూర్ణయ్య, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు

17న ట్రాఫిక్ మళ్లింపు : సిపి

ప్రజాశక్తి-విజయవాడ : ఈనెల 17వ తేదీ సాయంత్రం 4 గంటలకు విజయవాడలోని విధ్యాధరపురం బస్ డిపో వద్ద స్టేడియంలో ముస్లిం సోదరులకు "ఇఫ్తార్ విందు" నిర్వహించు సందర్భముగా, సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 7 గంటల వరకు ప్రజల సదుపాయం కోసం ట్రాఫిక్‌ను మళ్ళించినట్లు నగర పోలీసు కమిషనర్ కాంతిరాణా టాటా తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ జోజినగర్ జంక్షన్ నుండి సితార సెంటర్ వరకు, సితార సెంటర్ నుండి జోజినగర్ జంక్షన్ వరకు ఎటువంటి వాహనములు అనుమతించబడవన్నారు. గొల్లపూడి వై జంక్షన్ వైపునుండి సితార, చిట్టినగర్ వైపుకు వచ్చు అన్ని వాహనాలు ఎట్ కిన్సన్ స్కూల్ రోడ్డు, కబేళ వైపుకు మళ్ళించినట్లు తెలిపారు. చిట్టినగర్ వైపు నుండి గొల్లపూడి, హెచ్.బి.కాలనీ, ఊర్మిళానగర్ వెళ్ళు వాహనములను సితార జంక్షన్ వద్ద కుమ్మరిపాలెం వైపుకు లేదా కబేళ వైపుకు మళ్ళించామన్నారు. వై.యస్.ఆర్ కాలనీ/మిల్క్ ప్రాజెక్టు /కబేళా నుండి కాళేశ్వరరావు మార్కెట్ వైపుకు వెళ్ళు బస్సులు కబేళా-ఊర్మిలా నగర్-జోజినగర్ చర్చి జంక్షన్ - స్వాతి జంక్షన్- కనకదుర్గా ఫ్లైఓవర్ సర్వీసు రోడ్డు , కుమ్మరిపాలెం ఘాట్ రోడ్డు, కెనాల్ రోడ్డు మీదుగా వెళ్లాలన్నారు. ఎ1 పాస్"కలిగిన వారు విఎంసి స్టేడియం వరకు వచ్చి అక్కడి నుండి విధ్యాధరపురం ఆర్.టి.సి. డిపోలో వారి వాహనాలు పార్కింగ్ చేసుకోవాలన్నారు.

అనాధ బాలలకు ఆసరా అభినందనీయం



ప్రజాశక్తి-విజయవాడ : అనాధబాలలను ఆధరించి ఆదుకునేందుకు ముందుకు వచ్చి సహకరిస్తున్న స్వచ్ఛంద సంస్థల సహకారం వెలకట్టలేనిదని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు అన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక గవర్నర్ పేటలో నిర్వహిస్తున్న బాల సదన్‌లో ఆశ్రమానికి కోస్టల్ బ్యాంక్ అందించిన 1 లక్ష 50 వేల రూపాయల నిధులతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను శనివారం జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు ప్రారంభించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వీధి బాలలు, అనాధలు, పేద బలహీన వర్గాల పిల్లల సంక్షేమానికి ప్రభుత్వ పరంగా తీసుకుంటున్న చర్యలకు దాతల సహకారం తోడైతే విద్య, వైద్య ఆరోగ్య పరమైన సహకారం చిన్నారులకు అందించేందుకు వీలుంటుందన్నారు. కోస్టల్ బ్యాంకు అధికారులు సహృదయంతో ముందుకు వచ్చి చిన్నారులకు రక్షిత మంచినీటి సౌకర్యం కల్పించేలా వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. చిన్నారులకు అవసరమైన దుస్తులు తయారు చేసుకునేందుకు న్యాయవాది వి. వనదుర్గ 70 వేల రూపాయల విలువగల కుట్టుమిషన్‌ను రోటరీ క్లబ్ సభ్యులు మిఠాయిలు పంపిణీ చేసి దాతృత్వాన్ని చాటుకున్నారని వీరి స్ఫూర్తితో అనాధులను ఆదుకునేందుకు దాతలు ముందుకురావాలని జిల్లా కలెక్టర్ డిల్లీరావు కోరారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ జి. ఉమాదేవి, చైల్డ్ వెల్ఫేర్ కమిటి సభ్యురాలు చంద్రగిరి రాధాకుమారి, కోస్టల్ బ్యాంకు ఏజియం జె ఎస్ ఆర్ ఆంజనేయులు, మేనేజర్ వి. రామకృష్ణ, బాల సదన్ పర్యవేక్షకురాలు జోత్స్న, వసతి గృహ పర్యవేక్షకురాలు వి. సూర్యకుమారి, సిడిపివోలు కె.మంగమ్మ, జి. నాగమణి, పుష్పలత, లలితాకుమారి, రోటరీ క్లబ్ సభ్యులు చిన్నం రామకృష్ణ, పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో ఎంతో మేలు


రెడ్డిగూడెంలో...

ప్రజాశక్తి-మైలవరం : రైతులు తమ పంట పొలంలో భూసార పరీక్షలు చేయిస్తే ఎంతో మేలు జరుగుతుందని సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.శ్రీనివాసరావు సూచించారు. శనివారం స్థానిక రైతు భరిసా కేంద్రంలో భూపరిక్ష-శిక్షణవారం కార్యక్రమంలో భాగంగా విఏఏ, విహెచ్ఏ, ఎం పి ఈ ఓ లకు భూసార పరీక్షలు, మట్టి నమూనాలు సేకరణపై మండల స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంధర్భంగా ఏ డీఏ శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు తమ పొలంలో మట్టి నమూనాలను పరీక్షించుకుంటే భూసారాన్ని బట్టి పంటలు వేసుకోవచ్చని, వ్యవసాయాధికారులు సూచించిన ఎరువులను వేసుకుని నేలను మరింత సారవంతంగా (ఆరోగ్యంగా) చేసుకోవచ్చునని అన్నారు. మండలంలోని అన్ని రైతు భరోసా సిబ్బంది విఏఏ, వి హెచ్ఏ, ఎంపిఈ ఓ లు, ఎడ్వైజరి బోర్డు చైర్మన్ గోగులమూడి సాంబశివరావు,రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండల పరిధిలోని నరుకుళ్లపాడు రైతు భరోసా కేంద్రంలో భూసార పరిరక్షణ, మట్టి నమూనాల సేకరణ పై గ్రామ వ్యవసాయ/ఉద్యాన సహాయకులకు శిక్షణనిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సురేష్ మాట్లాడుతూ నేల లోని సేంద్రియ కర్బనం, లవణ సాంద్రత, ఉదజని సూచిక స్థూల మరియు సూక్ష్మ పోషకాలు విలువను భూసార పరీక్షలు నిర్వహించి తెలుసుకోవచ్చని అన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు, ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.

జొన్న, ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి - విజయవాడ రూరల్ : మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నున్న గ్రామం లో గల రైతు భరోసా కేంద్రంలో శనివారం జరిగింది. ఈ సమావేశంకు మండల సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి అధ్యక్షత వహించారు. రబి పంట గా జొన్న సాగు ఎక్కువగా ఉందని, ఇప్పటి కే కోతలు మొదలయ్యాయని పలువురు సభ్యులు సమావేశం దష్టి లో పెట్టారు.మరో 10-15 రోజలతే జొన్న కోత ముమ్మరంగా ఉంటుందని, సకాలములో జొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయుట వలన రైతులకు జొన్న అమ్ముకొనుటకు మద్దతు ధర పొందుటకు సానుకూలంగా ఉంటుందని వివరించారు. వ్యవసాయ శాఖ ఎ డి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జొన్న కొనుగోలు నిమిత్తమై సివిల్ సప్లైసే వారితో చర్చించామన్నారు. మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి మాట్లాడుతూ జొన్న కొనుగోలు విషయమై ఉన్నత అధికారులుతో మాట్లాడి కేంద్రం ఏర్పాటు చేసేలా, అదేవిధంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు కూడా ఏర్పాటుకు కృషి చేయనున్నట్లు తెలియజేసారు. మండల వ్యవసాయాధికారి రంగనాథ్‌బాబు మాట్లాడుతూ వేసవిలో భూసార పరీక్షలు చేయిస్తామని అన్నారు. జడ్పిటీసి సువర్ణ రాజు, కె. తాడేపల్లి సర్పంచ్ ఉయ్యురు గోపాలరావు, నున్న సోసైటీ చైర్మన్ పొలారెడ్డి చంద్రారెడ్డి పాల్గొన్నారు.

నేడ విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - వన్‌టౌన్ : కబేళా విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మత్తుల కారణంగా ఆదివారం ఉదయం 8 గంటల నుండి పది గంటల వరకు ఇండస్ట్రియల్ ఏరియా, కబేళా సెంటర్, ఊర్మిళా నగర్, జోజినగర్, లలితా నగర్, పోలీస్ కాలనీ, టెలిఫోన్ కాలనీ,సితార సెంటర్, లేబర్ కాలనీ, మిథిలా నగర్,ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్, తదితర ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుధాకర్ తెలిపారు.

విజయవంతంగా 'జగనన్నే మా భవిష్యత్తు'

ప్రజాశక్తి - వన్‌టౌన్ : జగనన్నే భవిష్యత్ కార్యక్రమం 175 నియోజకవర్గాలలో విజయవంతంగా జరుగుతోందని మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక భవానిపురంలో గల ఎన్టీఆర్ జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 7 లక్షల మంది జగనన్న సైనికులతో కలిసి ఇప్పటికే 61 లక్షల మంది ఇళ్లకు వెళ్లామన్నారు. 47 లక్షల మంది ప్రజలు 8296082960 నంబర్ కి మిస్డ్ కాల్ ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా రీజనల్ కొ ఆర్డినేటర్ మర్రి రాజశేఖర్ నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్ రావు,నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి,తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త దేవినేని అవినాష్, తాతినేని పద్మావతి,పైలా సోమినాయుడు,గౌస్ మొహిద్దిన్ పాల్గొన్నారు.

డ్రైనేజీలో పూడిక పనులు

ప్రజాశక్తి-కంచికచర్ల : కంచికచర్ల గ్రామంలో వసంత కాలనీ,గొట్టుముక్కల రోడ్డు తదితర ప్రాంతాల్లో డ్రైనేజీలో పూడిక పనులు చేపట్టారు. కొంత కాలంగా ఈ ప్రాంతంలో డ్రైనేజీ పూడుకు పోయి నీరు పారుదల కాక దుర్వాసన వెదజలుతుందని ప్రజలు అంటున్నారు. శనివారం కంచికచర్ల గ్రామ పంచాయతీ సర్పంచ్ వేల్పుల సునీత, ఉప సర్పంచ్ వేమా సురేష్ బాబు, కార్యదర్శి కనగాల రవికుమార్ ఆధ్వర్యంలో జేసీబీ డ్రైనేజీలో పూడిక తీత పనులు చేపట్టారు. పంచాయతీ బోర్డు సభ్యులు గ్రంధి ఆదిత్య తదితరులు పనులు పర్యవేక్షించారు.

విద్యుత్ సౌకర్యం కల్పించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ : జగనన్న కాలనీలకు శాశ్వత విద్యుత్ సౌకర్యం కల్పించి లబ్దిదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. జగనన్న కాలనీలలో విద్యుత్ సౌకర్యం మౌళిక వసతులపై శనివారం జిల్లా కలెక్టర్ డిల్లీరావు నగరంలోని కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో హౌసింగ్, విద్యుత్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు,సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 289 జగనన్న కాలనీలలో లబ్దిదారులకు గృహాలను కేటాయించామని, ఇప్పటికే వివిధ కాలనీలలో 11 వేలకు పైగా గృహ నిర్మాణాలను పూర్తి చేశామన్నారు.

అగ్నిప్రమాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-కంచికచర్ల : రాష్ట్ర విపత్తు స్పందన మరియు అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో అగ్నిమాపక వారోత్సవాలు శనివారం కంచికచర్ల లో రెండో రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఫైర్ స్టేషన్ అధికారి పి.వి.ఎన్.ఎం. కృష్ణముర్తి,కె. పవన్ కుమార్ అధ్వర్యంలో, జుజ్జూరు రోడ్డులో బస్ స్టాండ్ లో, షాపింగ్ మాల్స్ లో అగ్నిప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తో కూడిన గోడపత్రిక, కర పత్రాలు పంపిణీ చేశారు. అనుకోకుండా అగ్ని ప్రమాదం సంభవిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.. అగ్నిమాపక శాఖ సిబ్బంది , బి.శ్రీను, ఎం. అశోక్, ఎస్ కె తాజుద్దీన్, బి. సంజయ్ వర్మ,జి.వి నర్సయ్య, ఈ.కష్ణ రెడ్డి, షేక్ సుభాని,శీలం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టిటిపిఎస్‌లో అగ్ని ప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా డాక్టర్ నార్లతాతారావు థర్మల్ కేంద్రంలోని 4వ దశ పరిపాలన భవనంలో శనివారం ఫైర్ అండ్ సేఫ్టీ అధికారులు మాక్ డ్రిల్ నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఉద్యోగులకు కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ వారోత్సవాలలో ఫైర్ సిబ్బంది పనివిధానం అగ్నిమాపక యంత్రాల వినియోగం అంశాలపై వివరించారు. సూపరింటెండెంట్ ఇంజనీర్ కె జవహర్ సేఫ్టీ ఆఫీసర్ ఎం నాగబాబు, ఫ్యాక్టరీ మేనేజర్ వి సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ డివిజనల్ ఫైర్ ఆఫీసర్ రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

ప్రజాశక్తి-వత్సవాయి : గ్రామ రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని వీఆర్‌ఏల సంఘం అధ్యక్షులు దారెల్లి బసవయ్య డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వత్సవాయిలో శనివారం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. ఈసందర్భంగా బసవయ్య మాట్లాడుతూ వీఆర్‌ఎలకు సీనియార్టీ ప్రకారంగా ప్రమోషన్ ఇవ్వాలని, కనీసం వేతనం వీఆర్‌ఏలకు 26 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశ్యారు. ఈ కార్యక్రమంలో యన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు బొడ్డు వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : స్థానిక వించిపేట 54వ డివిజన్ షాహి మజీద్ వద్ద స్థానిక కార్పొరేటర్ అబ్దుల్ ఆర్శద్ ఆద్వర్యంలో శనివారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు ఈ విందులో ముస్లిం సోదరులతో కలిసి మాజీ మంత్రి పశ్చిమ నియోజకవర్గం శాసన సభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు పాల్గొని ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఎమ్మెల్సీ రుహుల్లా,వహాబ్, జిల్లా వక్ఫ్ బోర్డ్ గౌస్ మొహిద్దిన్,ఇర్ఫాన్,క్వాలిటీ ఖాదర్,సలీం తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

పెనమలూరు : దేవినేని రాజా,గ్రామ సర్పంచ్,గ్రామ పెద్దలు, లయన్ రావి సురేష్ బాబు ఆధ్వర్యంలో ఈడుపుగల్లు గ్రామంలో ఆనంద్ విహార్ అపార్ట్మెంట్ ఆవరణలో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటుచేశామని నిర్వాహకులు తెలిపారు. ప్రముఖ కార్పొరేట్ హాస్పిటల్స్ టాప్ స్టార్, పర్ఫెక్ట్ డెంటల్ కేర్,మాక్సివిషన్ కంటి ఆసుపత్రి డాక్టర్లు పాల్గొంటారని పేర్కొన్నారు. నరాలు, గుండె, గర్భిణీ స్త్రీలు, షుగర్ సమస్యలు, ఎకో, కంటి, పంటి సమస్యలపై పరీక్షలు నిర్వహించి డాక్టర్లు ఉచితంగా మందులు ఇస్తారని రావి సురేష్ బాబు తెలిపారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు : ఎపిఎం

ఘంటసాల : డ్వాక్రా మహిళలు కష్టపడి కట్టే నగదును సొంత ఖర్చులకు వినియోగించి అవకతవకలకు పాల్పడితే వారిపై చర్యలు తీసుకోక తప్పదని ఇన్చార్జ్ ఏపీఎం బాపనయ్య హెచ్చరించారు. శనివారం ఘంటసాలలోని వెలుగు కార్యాలయ సమావేశ మందిరంలో వివోఏలతో రివ్యూ మీటింగ్ ను ఏపీఎం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ డ్వాక్రా గ్రూపు సభ్యుల నుంచి ఏలాంటి నగదును వివోఏలు తీసుకోకూడదని, సభ్యులు ఇచ్చిన ప్రతీ రూపాయికి రశీదులు ఇవ్వవలసిన బాధ్యత వివోఏలదే అన్నారు. ఇటీవల కొన్ని గ్రూపులలో అవకతవకలు జరిగాయని అవి తమ దృష్టికి వచ్చిందన్నారు.

సముద్రంలో వేట నిషేధం అమలు



ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్

సముద్రంలో చేపల వేటను నిషేధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 15 నుండి జూన్ 14 వరకు 61 రోజుల పాటు సముద్రంలో మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని సముద్రంలో చేపల వేటపై నిషేధం కొనసాగుతుందని ఆంధ్ర ప్రదేశ్ మత్స్యశాఖ తెలియచేసింది. సముద్రంలో చేపలు, రొయ్యలు సంతాన ఉత్పత్తి, మత్స్య సంపద అభివృద్ధి కొరకు నిషేధం విధించింది. ఈ సమయంలో మరబోట్లు మేకనైజ్డ్ బోట్లు, మోటారు బోట్లతో సముద్రంలోకి వెళ్లడం నిషేధం. ఎవరైనా ప్రభుత్వ ఉత్తర్వులు దిక్కరిస్తూ సముద్రంలో వేటకి వెళ్ళి పట్టుబడితే బోట్లు, బోట్లలో ఉండే మత్స్య సంపద, వలలు స్వాధీనం చేసుకుని, మత్స్యకారులకు కల్పించే డీజిల్ పై రాయితీ, ఇతర పథకాలు రద్దు చేస్తామని మత్స్యశాఖ తెలియచేసింది.

తీరానికి చేరుకుంటున్న బోట్లు:

శనివారం అర్ధరాత్రితో నిషేధం అమలులోకి రావటంతో ఒక్కొకటిగా వేటకి వెళ్లిన బోట్లు రెండు నెలల విరామం కోసం బోట్లు తీరానికి చేరుకుంటున్నాయి. చేపల పునర్ఉత్పత్తి కోసం సముద్రంలో 61 రోజుల పాటు అమల్లో ఉంటుంది. వేట నిషేధాన్ని పక్కాగా అమలు చేసేందుకు ప్రభుత్వం పకట్బందిగా ఏర్పాట్లు కూడా చేస్తోంది. ప్రభుత్వం మే రెండో వారంలో వైఎస్సార్ మత్స్యకార భరోసా (వేట నిషేధ భృతి) పంపిణీ సిద్ధం అవుతుంది.

గంగ పుత్రులకు సాయం అందేనా?

గత ప్రభుత్వంలో వేట సాగించే మత్యకార కుటుంబాలకు విరామ సమయంలో రూ 4 వేలు చొప్పున ఇచ్చే వేట నిషేధ భతిని వైఎస్సార్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ 10 వేలకు పెంచింది. ఈ మొత్తాన్ని నిషేదకాలం ముగియక మునుపే బ్యాంకు ఖాతాలకు నేరుగా జమచేస్తూ గంగ పుత్రులకు అండగా నిలుస్తోంది.

17 నుంచి లబ్ధిదారుల గుర్తింపు

ఆర్బీకేల్లో పనిచేసే గ్రామ మధ్య సహాయకుడు, వాలంటీర్, సాగరమిత్రలతో ఏర్పాటు చేసిన బందంతో ఈ నెల 17వ తేదీ లబ్దిదారుల గుర్తింపు ప్రక్రియ చేపట్టనున్నారు. తీరంలో లంగరేసిన బోట్లను ఈ బందం పరిశీలించనుంది. వివరాలు నమోదు చేసే సమయంలో బోటు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, ఫిషింగ్ లైసెన్సు, ఆధార్ కార్డు, రైస్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు కావాల్సి ఉంటుంది. 18 వ తేదీ గ్రామ సచివాలయ డిపార్ట్మెంట్ రూపొందించే సాఫ్ట్ వేర్ అప్లోడ్ చేస్తారు. వెరిఫికేషన్ తర్వాత జాబితాను సామాజిక తనిఖీకి 3 ఆర్బీకేల్లో ప్రదర్శిస్తారు.

కొనసాగుతున్న జనసేన దీక్షలు

ప్రజాశక్తి-అవనిగడ్డ

అవనిగడ్డ-కోడూరు ప్రధాన రహదారి నిర్మాణం వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ అవనిగడ్డ నియోజకవర్గ జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే దీక్షలు నాలుగో రోజుకు చేరుకున్నాయి. శనివారం ఈ దీక్షల్లో నాగాయలంక మండలానికి చెందిన జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు దీక్షల్లో కూర్చున్నారు వీరికి నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు సంఘీభావం ప్రకటించారు ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ గతంలో కూడా రూ.80 లక్షలతో తాత్కాలిక మరమ్మతులు చేయించారని కానీ ఏమాత్రం పని జరిగినట్లు కనిపించడం లేదన్నారు. అధికార పార్టీ నాయకులు జేబులు నింపుకోవడానికి మాత్రమే ఈ తాత్కాలిక మరమ్మత్తులు పనుల పేరుతో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. టెండర్లు పిలిపించామనీ, అగ్రిమెంట్ అయిందని చెప్పిన వైసీపీ నాయకులు రుజువులు చూపించగలరా? అని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో నాగాయలంక పార్టీ మండల అధ్యక్షులు చింత వెంకటేశ్వరరావు, రాష్ట్ర మత్స్యకార వికాస విభాగ కమిటీ కార్యదర్శి లంకె యుగంధర్, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు, అవనిగడ్డ, కోడూరు మండల పార్టీ అధ్యక్షులు గుడివాడ శేషుబాబు, మరే గంగయ్య, పి.మల్లికార్జునరావు, బొడ్డు విజయ్, బోనం పాపారావు, ప్రేమల మురళి, లేబాక అంకాలరావు, కొక్కిలిగడ్డ రమేష్, మహిళా నాయకులు శిరీష, బలరాం, వడ్లమూడి రామకృష్ణ, యర్రంశెట్టి నాగ బసవయ్య, మేక సురేష్, పిట్లంక సర్పంచ్ కనకాల వెంకటేశ్వరరావు, బచ్చు ప్రశాంత్, బచ్చు శ్రీహరి, కోసూరి అవినాష్, బొప్పన పృథ్వీ, వార్డ్ మెంబర్ కమిలి సాయి భార్గవ తదితరులు పాల్గొన్నారు.



దీక్షల్లో పాల్గొన్న నాయకులు

మట్టి నమూనాల సేకరణపై అవగాహన

ప్రజాశక్తి-యంత్రాంగం

వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా మట్టిపరీక్షా వారోత్సవ కార్యక్రమాలు శనివారంనాడు జరిగాయి. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘంటసాల : ఘంటసాల మండలంలోని 13 రైతు భరోసా కేంద్రాల గ్రామ వ్యవసాయ సహాయకులకు భూసార పరీక్షలు నిర్వహించటంపై, రైతుల పొలాల నుంచి మట్టి నమూనాలు సేకరించటంపై కార్యశాలను మండల వ్యవసాయ శాఖాధికారి కె.మురళీకృష్ణ నిర్వహించారు. శనివారం ఘంటసాలలో జరిగిన ఈ కార్యశాలకు ముఖ్యఅతిథిగా మొవ్వ ఏడిఏ ఎస్.శ్యామల, మండల వ్యవసాయాధికారి మురళీకష్ణ మాట్లాడారు. రైతులు పొలాల నుంచి శాస్త్రీయ పద్ధతిలో మట్టి నమూనాలను సేకరించి ప్రయోగశాలకు నమూనాలను పంపించి ప్రయోగశాల ఫలితాలను రైతులకు అందజేయాలన్నారు. నేల ఆరోగ్యం, సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రయోగశాల ఫలితాలను బట్టి రైతులు ఎరువులు వాడేలా అవగాహన కల్పించి విచక్షణారహితంగా ఎరువుల వాడకాన్ని తగ్గించటం ద్వారా రైతులకు పెట్టుబడి ఖర్చులు గణనీయంగా తగ్గుతాయని తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో 13 రైతు భరోసా కేంద్రాల, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు. తొలుత క్షేత్రస్థాయిలో మట్టి నమూనాలు సేకరించే విధానంపై ఏడిఏ వివిఏలకు అవగాహన కల్పించారు. **గుడ్లవల్లేరు :** మట్టి పరీక్ష వారోత్సవాలలో భాగంగా గుడ్లవల్లేరు మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వడ్ల మన్నాడు ఆర్.బి.కెలో మండల వి ఎఎ లు అందరికీ స్థానిక వ్యవసాయ శాఖ అధికారి సునీల్ సాయిల్ టెస్టింగ్ నిమిత్తం సేకరించు విధానంపై ప్రాక్టికల్ గాను, బోధనా పరంగా వివరించారు. ఈ కార్యక్రమంలో డిఎవిబి సభ్యుడు పెన్నేరు ప్రభా కర రావు, ఎంపీటీసీ సభ్యులు దివి లీ ల కుమార్,పంచాయతీ వైస్ ప్రెసిడెంట్ రాంబాబు,వివిఎలు, రైతులు పాల్గొన్నారు. పమిడిముక్కల : మండలంలోని లంకపల్లి, తాడంకి, మంటాడ గ్రామాల్లోని ఆర్బికె కేంద్రాల్లో మట్టి నమూనా వారోత్సవాల్లో భాగంగా మట్టి నమూనాలను సేకరించారు. పమిడిముక్కల మండల వ్యవసాయ అధికారి గణేష్ రెడ్డి మాట్లాడారు.



పమిడిముక్కల మండలంలో



గుడ్లవల్లేరు మండలంలో

'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం

ప్రజాశక్తి-గన్నవరం (హనుమాన్ జంక్షన్)

గన్నవరం నియోజకవర్గంలోని బాపులపాడు మండలం బాపులపాడు గ్రామంలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. రాష్ట్ర నాటక రంగ డైరెక్టర్ నక్క గాంధీ అధ్యక్షతన గ్రామ సర్పంచ్ సరిపల్లి కమలాబాయి, బాపులపాడు జడ్పిటిసి సభ్యురాలు కొమరవెల్లి గంగాభవాని, ఎంపీపీ యరగొర్ల నగేష్ లతో పాటు వైసీపీ సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు, గృహసారథులతో కలిసి పలు కుటుంబాలను నేరుగా కలిశారు. ప్రస్తుత జగన్మోహన్ రెడ్డి పరిపాలనపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నక్కా గాంధీ మాట్లాడుతూ ఇతర రాష్ట్రాలు కూడా ఏపీని ఆదర్శంగా తీసుకునే పరిస్థితి వచ్చిందన్నారు. మంచి చేస్తున్న ప్రభుత్వంపై ప్రతిపక్షాలు కుట్రలు చేస్తున్నాయన్నారు. 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ ప్రజలకు సంక్షేమ పథకాలు అందించలేదని విమర్శించారు. మరో ఏడాదిలో ఎన్నికలు వస్తున్నాయని తెలిసి ప్రజలను తప్పుదోవ పట్టించడానికి ప్రయత్నాలు చేస్తున్నాయని విమర్శించారు. పేదల పక్షాన తమ ప్రభుత్వం ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ కొక్కిలిగడ్డ లత, వాలంటీర్స్ కోట ఆమని, నూరిశెట్టి నాగలక్ష్మి, సుంకర కరుణ, స్వర్ణ రూప తేజస్విని, ధనికొండ ఎస్తేరు రాణి, యాదల మహి డేనియల్ పాల్, ఆర్కాటి జ్యోతి సరస్వతి, గహ సారథులు త్రివేదీ పండు, కంపాటి ప్రసాద్, తిప్పనపల్లి వెంకటేశ్వరరావు, పొట్రు సంధ్య, నూరిశెట్టి విజయ్ కుమార్, కొమరవెల్లి కిరణ్ మూర్తి, కొమరవెల్లి థామస్, కోటా ప్రకాష్ పాల్గొన్నారు. **మోపిదేవి:** మోపిదేవి మండల పరిధిలోని వెంకటాపురం గ్రామ పంచాయతీలోని అన్నవరం గ్రామంలో పంచాయితీ సర్పంచ్ తుమ్మా సోమలమ్మ, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తుమ్మ రవి పర్యవేక్షణలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సచివాలయ కన్వీనర్లు పేరు బోయిన వీరాంజనేయులు, గుర్రం వెంకట సత్యనారాయణల ఆధ్వర్యంలో గ్రామ వాలంటీర్లు, గృహ సారథులు ఇంటింటికి తిరుగుతూ అభిప్రాయాలను సేకరిస్తున్నారు. సర్పంచ్ సోమలమ్మ తానే స్వయంగా గహ యజమానుల అంగీకారంతో జగన్ స్టిక్కర్లను అంటిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అబ్బూరి నాంచారయ్య, వార్డు సభ్యులు తుమ్మా ముఖర్జీ తదితరులు పాల్గొన్నారు.



బాపులపాడు మండలంలో



మోపిదేవి మండలంలో

అంబేద్కర్‌కు ఘన నివాళి

అవనిగడ్డ : మండలంలోని మోదుమూడి గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి డిఆర్ఓ ఎం.వెంకటేశ్వర్లు, ఏపీ సెక్రెట రియట్ లా జాయింట్ సెక్రెటరీ వెలగపల్లి వెంకటేశ్వరరావు నివాళు లర్పించారు. కంచర్ల జయరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అంబేద్కర్ విగ్రహానికి పూలదండలు వేసి నివాళు లర్పించారు. అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసి మొదటి సంవత్సరం పూర్తి అయిన సందర్భంగా వార్షికోత్సవాన్ని కూడా నిర్వహించారు. తొలుత భీమ్ దీక్ష దారులు దాసి సీతారామరాజు, దోవ గోవర్ధనక్షకు డిఆర్ఓ చేతులు మీదుగా దీక్ష విరమణ కార్యక్రమం నిర్వహించారు. జనసేన పార్టీ మండల అధ్యక్షులు గుడివాడ శేషుబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ మాజీ ఎంపీపీ దిడ్ల ప్రసాద్, దాసి సీతారామరాజు, కర్ర కృష్ణారావు, సురేష్ గ్రామ పెద్దలు కర్ర శ్రీనివాసరావు, మెరుగు ప్రసాద్, పెనుమాక చంటి, గుంటూరు జోజి, పెనుమాక వెంకట్నాథ్, విగ్రహ కమిటీ సభ్యులు, అంబేద్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు. **కంకిపాడు :** భారత రాజ్యాంగ నిర్మాత, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 132వ జయంతి వేడుకలను కంకిపాడు తహశీల్దార్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. కంకిపాడు తహశీల్దార్ తోట వెంకట సతీష్ అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచం గర్వించదగిన ఆదర్శప్రాయుడు అంబేద్కర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ భాస్కరరావు, తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది, విఆర్ఓ,లు, గ్రామ సర్వేయర్, విఆర్ఎలు పాల్గొన్నారు.



అవనిగడ్డలో



కంకిపాడులో

ప్రజావ్యతిరేక, మతోన్మాద బిజెపిని సాగనంపుదాం

- ప్రచారభేరి సభలో సిపిఎం, సిపిఐ నాయకులు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న మతోన్మాద బిజెపిని సాగనంపాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకష్ణ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ లో వామపక్షాల ఆధ్వర్యంలో శనివారం ప్రచార బేరి నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం, సీపిఐ పార్టీల ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాల నాయకులు, కార్మికులు జగ్గయ్యపేట పట్టణ వీధుల్లో తిరిగి ప్రధాని నరేంద్ర మోడీ, బిజెపి ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఎన్టీఆర్ సర్కిల్ వద్ద సిపిఎం పార్టీ మండల కార్యదర్శి సోమోజు నాగమణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకష్ణ మాట్లాడుతూ రానున్న నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత కూలీలు, కార్మికులు, రైతులు ఏ ఒక్కరు కూడా దేశంలో సంతోషంగా లేదని అన్నారు. 2014 లో నరేంద్ర మోడీ తాము అధికారంలోకి వస్తే రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు వారి ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని, దేశంలో ఉన్న నల్లధనాన్ని తీసుకొస్తామని, నిరుద్యోగాన్ని రూపుమాపుటకు ప్రతి సంవత్సరం 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత చెప్పిన ఏ హామీని నెరవేర్చిన దాఖలాలు లేవన్నారు. సిపిఎం పార్టీ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్ సిహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ మతోన్మాద మోడీ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు అందరూ కలిసి రావాలని ప్రచార సభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కోటా కష్ణ, దంతాల వెంకటేశ్వర్లు, కాకనబోయిన లింగారావు, షేక్ గౌస్ మియా, సిపిఐ నాయకులు దోనేపూడి శంకర్, జె శ్రీనివాసరావు, అంబోజి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-నందిగామ : ప్రజా వ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద బిజెపిని సాగనంపి దేశాన్ని కాపాడుకుందామని సిపిఎం పార్టీ ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి కృష్ణ అన్నారు. శనివారం స్థానిక నందిగామ సుందరయ్య కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్నారు. ప్రతీ వ్యక్తీ గొంతెత్తి కేంద్ర ప్రభుత్వ దుర్మార్గాలను నిలదీయాలని, లేకుంటే అందరి భవిష్యత్తూ చీకటిమైయమై పోతుందన్నారు. మోడీ - అమితాల నాయకత్వంలో బిజెపి-ఆర్ఎస్ ఎస్ కూటమి ప్రజల మధ్య మత విద్వేషపు చిచ్చురాజేస్తోందని, మరోవైపు అదానీ,అంబానీ లాంటి అతి సంపన్నులకు దేశ సంపదను దోచిపెడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ టౌన్ కార్యదర్శి కే గోపాల్, సయ్యద్ ఖాసిం, గోపి నాయక్, వల్లూరు రవి శేఖర్, కర్రీ వెంకటేశ్వరరావు, ఏవి నారాయణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డివిఆర్ కాలనీలో సిపిఎం ప్రచార బేరి యాత్ర

నందిగామ పట్టణ పరిధిలోని 17వ వార్డు డివిఆర్‌కాలనీలో శనివారం సాయంత్రం సిపిఎం ఆధ్వర్యంలో ప్రచార బేరి యాత్ర నిర్వహించారు. ఇంటింటికి తిరిగి సిపిఎం నాయకులు కరపత్రాలు పంపిణి చేశారు. కేంద్రంలో బిజెపిప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండ కడుతూ ప్రజలకు వివరించారు. బిజెపి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను సిపిఎం నందిగామ పట్టణ కార్యదర్శి కటారపు గోపాల్ ఎండ కట్టారు. పెంచిన నిత్యావసరవస్తువుల ధరలు, పెట్రోల్,డీజిల్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సయ్యద్ ఖాసిం, గోపి నాయక్, వల్లూరి రవిశేఖర్, కర్రి వెంకటేశ్వరరావు, ఎ.వి.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి -తిరువూరు : తిరువూరు సుంకర వీరభద్ర రావు భవనంలో మోడీని గద్దదించండి దేశాన్ని కాపాడండి ప్రచార భేరి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సిపిఎం, సిపిఐ నాయకులు శనివారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మేకల నాగేంద్రప్రసాద్, సీపీఐ జిల్లా నా యకులు తూము కష్ణయ్య మాట్లా డుతూ మతో న్మాద, కార్పొరేట్ అనుకూల, ప్రైవేట్ విధానాలను తిప్పి కొట్టడం, రాజ్యాంగ ప్రజాస్వామిక హక్కులను కాపాడు కోవడం, ఏపీకి ప్రత్యేక హెూదా, విభజన హామీలు, పోలవరం నిర్మాణం పై కంద్ర ప్రభుత్వం చేస్తున్న ద్రోహాన్ని ప్రతి ఒక్క రికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని అమ్మకాన్ని వ్యతిరేకిస్తూ ఉద్య మించటం, ప్రజాస్వామ్యం పరిరక్షణ కు అందరూ కలిసి ముందడుగు వేయాలని, వామపక్షాల ఐక్యతను పరిర క్షించుకోవాలని నాగేంద్ర ప్రసాద్, కష్ణ య్య తెలిపారు. ఈకార్యక్రమంలో సిపిఎం నాయకులు మర్సకట్ల ప్రభాక రరావు, బి. వెంకటేశ్వరరావు, పంతంగి శ్రీనివాసరావు, సాంబారు వెంకటేశ్వ ర్లు, సిపిఐ నాయకులు నాగుల్ మీరా, చిలుకూరి వెంకటేశ్వర రావు, కొత్తపల్లి సుందరరావు, ఉదయ్, బాణాల అశోక్, సుభాని పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం : దేశంలోని కేంద్రప్రభుత్వ బిజెపి దుర్మార్గాలపై గొంతు ఎత్తాల్సిన అవసరం ఏర్పడిందంటూ ఆనాటి స్వాతంత్ర్యస్ఫూర్తితో మళ్ళీ ఉద్యమించాల్సిన అవసరం ఏర్పడిందంటూ వివరి స్తూ కొండపల్లి మున్సిపాలిటీ పురవీధుల్లో సిపిఎం పార్టీ కార్యకర్తలు నాయకులు శనివారం కరపత్రాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ప్రజలకి కమ్యూనిస్టుల అవసరం ఎంతైనా ఉందని గుర్తించి ప్రజల్లో చైతన్యాన్ని తీసుకొచ్చి సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో బిజెపి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని చెప్పి ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎంపార్టీ కొండపల్లి పట్టణ కార్యదర్శి యంమహేష్‌కమిటీ సభ్యులు ఆలేటి విఠలరావు బేబీ సరోజిని కొండలరావు వెంకటేశ్వరరావు పార్టీ సభ్యులు భాష కోటేశ్వరరావు పాపయ్య బాబురావు వీరయ్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి-వీరులపాడు : కేంద్రంలో నరేంద్ర మోడీ నాయకత్వంలో బిజెపి ప్రభుత్వం పేద మధ్యతరగతి ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతుందని ఇటువంటి ప్రజా వ్యతిరేక బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించి దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత దేశ ప్రజలపై ఉందని సిపిఎం పార్టీ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోట కళ్యాణ్ పిలుపునిచ్చారు. వీరులపాడులోని వాసిరెడ్డి భాస్కరరావు కమ్యూనిటీ హాలు లో సీపీఐ సీపీఎం విసత స్థాయి సమావేశం కామ్రేడ్ వట్టికొండ చంద్రమోహన్ అధ్యక్షుతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 14వ తేదీ నుండి 30వ తేదీ వరకు దేశవ్యాప్తంగా బిజెపి ని, మోడీని గద్దె ధింపండి దేశాన్ని కాపాడండి అని నినాదంతో వామపక్షాల ఆధ్వర్యంలో ప్రచార బేరి నిర్వహిస్తున్నామని, మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశ సంపదని కార్పోరేట్ల పరం చేస్తూ పేద ప్రజలపై పన్నులు పెంచుతున్నాయని దుయ్యబట్టారు. నిత్యవసర సరుకుల పెరుగుదలతో పేదలు కడుపునిండా పౌష్టికాహారం తినే పరిస్థితులు లేకుండా పోయాయని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు బిఎస్ఎన్ఎల్, ఎల్ఐసి, రైల్వే, వైజాగ్ స్టీల్ ప్లాంట్ ,ఇలా అన్నింటినీ ఆదాని, అంబానీలకు కట్టబెడుతూ దేశ సంపదను దోచిపెడుతున్నారని వాపో యారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంపీటీసీ సభ్యులు మండూరి ప్రకాష్ రావు, సిపియం మండల కార్యదర్శి చాట్ల రవి, కోడూరు పిచ్చేశ్వరావు, వట్టి కొండ పార్థసారథి ,రమేష్ పొందుగుల వెంకటరావు ,సిపిఐ సీనియర్ నాయకులు అల్లూరు దుర్గయ్య, షేక్ మహబూబ్ సుభాని ,వాసిరెడ్డి సాంబశివరావు షేక్ గుల్ మహ్మద్ పాల్గొన్నారు

ప్రజాశక్తి -గంపలగూడెం : ఈనెల 14వ తేదీ నుండి 30వ తేదీ వరకు కొనసాగు ప్రచార భేరీని విజయవంతం చేయాలని సిపిఎం, సిపిఐ పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం నాడు స్థానిక సిపిఎం కార్యాలయం వద్ద గోడపత్రికలను విడుదల చేశారు అనంతరం మాట్లాడుతూ, కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక , నిరంకుశ విధానాలపై ఈ బేరి నిర్వహించడం జరుగుతుందన్నారు. మండల పార్టీ కార్యదర్శి లు గువ్వల సీతారామిరెడ్డి, షేక్ నాగుల్ లమీర, సిఐటియు మండల కార్యదర్శి జానపాటి వెంకటేశ్వ రరావు, ఉన్నం సాంబశివరావు దివ్య నాగేశ్వరరావు, అల్లవరపు కుటుంబరావు, ఏలూరు శాంత కుమారి, ఎన్ సత్యంబాబు,నాయకులు పాల్గొన్నారు



జగ్గయ్యపేటలో...



నందిగామలో...



గంపలగూడెంలో...



ఇబ్రహీంపట్నంలో..



తిరువూరులో...



గవర్నర్‌ను కలిసిన బెజవాడ బార్ అసోసియేషన్ న్యాయవాదులు

ప్రజాశక్తి-విజయవాడ : ఇటీవల కొత్తగా ఎన్నికయిన బెజావాడ బార్ అసోసియేషన్ సభ్యులు రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నరీజ్‌ను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె.బి.సుందర్ , ఉపాధ్యక్షుడు పుప్పాలా శ్రీనివాస్ , జనరల్ సెక్రటరీ జన్ను శ్రీధర్ , జాయింట్ సెక్రటరీ నరహరిశెట్టి జ్యోతి , లైబ్రేరియన్ ఆకుల పాండురంగ విటల్ గారు, కోశాధికారి బత్తుల వెంకటేశ్వర్లు , లేడీస్ సెక్రటరీ పెనుమాల జయలక్ష్మి, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ పగడాల ఆంజనేయులు , ఇతర న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.ఈ సందర్భంగా గవర్నర్ నూతనంగా ఎన్నికయిన బార్ అసోసియేషన్ న్యాయవాదులను అభినందించారు.



ఆల్ మునీర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఆల్ మునీర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలోని హెూటల్ మానర్ ఫుడ్ ప్లాజా నందు ఇఫ్తార్ విందు కార్యక్రమం శనివారం సాయంత్రం జరిగింది. ఈకార్యక్రమంలో రాష్ట్ర మంత్రి అంజద్ అహ్మద్, శాసన సభ్యులు వెల్లంపల్లి శ్రీనివాసరావు, విజయవాడ తూర్పు నియోజకవర్గం వైసీపీ ఇన్‌చార్జి దేవినేని అవినాష్‌తో పాటు పలువురు ముస్లిం పెద్దలు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆల్ మునీర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు షేక్ మునీర్ అహ్మద్ మాట్లాడుతూ రంజాన్ పర్వదినం సందర్భంగా ప్రతి సంవత్సరం తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. తమ ఫౌండేషన్ పలు సామాజిక, సాంస్కృతిక, సేవా కార్యక్రమాలను కూడా నిర్వహిస్తుందని తెలిపారు.

మృతుని కుటుంబానికి సాయం

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం : కొండపల్లిలోని ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వడ్రంగి కార్మికుడు నచర్ల వెంకటాచారి కుటుంబానికి సిఐటియు చొరవతో రూ.25వేలు ఆర్థికసాయం శనివారం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి యం మహేష్ మాట్లాడుతూ కార్మికులకు అండగా సిఐటియు ఎప్పుడు ఉంటుందన్నారు. కొండపల్లికి చెందిన వడ్రంగి కార్మికుడు వెంకటాచారి జికొండూరు మండలం పినపాక వద్ద పిబ్రవరి 25న రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు తెలిపారు. సిఐటియు చొరవతో వడ్రంగి మేస్త్రి అయించ రామకృష్ణ ఆర్థిక సహకారంతో మృతి చెందిన వడ్రంగి కార్మికుడు వెంకటాచారి భార్యకు అందజేశారు. ఈ సాయాన్ని బ్యాంకులో పిల్లల పేరుతో జమ చేయించినట్లు తెలిపారు. బ్యాంకు బుక్‌ను కుటుంబ సభ్యులకు అందజేసిన వారిలో సిఐటియు మండల ఉపాధ్యక్షులు రామకృష్ణ డివైఎఫ్ఐ మండల కార్యదర్శి షేక్‌బాషా వెంకటచారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.



బ్యాంకు బుక్‌ను అందజేస్తున్న దృశ్యం

రేపటితో పదో తరగతి పరీక్షలు ముగింపు

- 19 నుండి స్పాట్ వాల్యుయేషన్

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : జిల్లాలో నిర్వహించిన పదో తరగతి పరీక్షలు అత్యంత కట్టుదిట్టమైన ఏర్పాట్లతో ప్రశాంతంగా నిర్వహించిన్నట్లు జిల్లా కలెక్టర్ డిల్లీరావు తెలిపారు. జిల్లాలో పదవ తరగతి పరీక్షలు నిర్వహిస్తున్న నేపథ్యంలో శనివారం జిల్లా కలెక్టర్ డిల్లీరావు గొల్లపూడి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా నిర్వహిం చిన్నట్లు తెలిపారు. 19వ తేది నుండి 26వ తేది వరకు బిషప్ అజరయ్య పాఠశాలలో స్పాట్ వాల్యేషన్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.

హెల్త్ అలవెన్స్ బకాయిలు ఇవ్వాలి

ప్రజాశక్తి-విజయవాడ : మునిసిపల్ ఆప్కాస్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న రెండు నెలల హెల్త్ అలవెన్స్ బకాయిలు సత్వరమే ఇవ్వాలని మునిసిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) విఎంసి అధికారులను కోరింది. ఈ మేరకు యూనియన్ నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎస్ జ్యోతిబాస్, ఎం డేవిడ్‌లతో పాటు పలువురు నాయకులు కలిసి ప్రజారోగ్య విభాగం ముఖ్యఅధికారి రత్నావళికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మునిసిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన చేయాల్సి వస్తోందని అన్నారు. రెండు మాసాల హెల్త్ అలవెన్స్ బకాయిలు రానందున, కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పెరిగిన ధరల నేపథ్యంలో విధుల్లోకి రావాలంటే సుదూరు ప్రాంతాల నుంచి సకాలంలో రాలేక ఆటోలకు హెచ్చు మొత్తంలో ఖర్చు చేయక తప్పడం లేదన్నారు. మరొక వైపున వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని మధ్యాహ్నం పూట మస్తర్ వేసే సమయాన్ని మార్చాలని కోరారు. ఇవే కాగా కార్మికులు నిరంతరం అనేకసమస్యలు ఎదుర్కొంటున్నారని, పలు సార్లు వినతిపత్రాలు ఇస్తున్నా ప్రయోజనం ఉండటం లేదని అన్నారు. ఇప్పటికయినా రెండు నెలల బకాయి ఉన్న హెల్త్ అలవెన్స్‌తో పాటు మధ్యాహ్నం మస్తర్ వేసే సమయాలను మార్చాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన సిఎంఒహెచ్ డాక్టర్ పి రత్నావళి మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించడానికి అధికారులందరూ ముందుంటారని అన్నారు. మధ్యాహ్నం మస్తర్ వేసే సమయాన్ని మారుస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షులు దోనేపూడి కాశీనాథ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి టి ప్రవీణ్, ఉపాధ్యక్షులు వి సాంబులు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణానికి త్వరగా రుణం

టాటా క్యాపిటల్ ఫైనాన్స్ జోనల్ మేనేజర్ అశోక్‌కుమార్

గుడివాడ : స్థానిక రావి టెక్‌టెల్స్ సమీపంలోని చింతా ప్లాజా 2వ అంతస్తులో నూతనంగా ఏర్పాటు చేసిన టాటా క్యాపిటల్ ఫైనాన్స్ కంపెనీని శనివారం జోనల్ మేనేజర్



ప్రారంభిస్తున్న టాటా క్యాపిటల్ ఫైనాన్స్ జోనల్ మేనేజర్ అశోక్‌కుమార్

అశోక్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 12 టాటా క్యాపిటల్ ఫైనాన్స్ కంపెనీలు ఉన్నాయన్నారు. గుడివాడలో ఏర్పాటుచేసిన కంపెనీలో ప్రతేకంగా గృహ నిర్మాణాలకు రూ.25 లక్షల వరకు రుణాలు అందిస్తామన్నారు. చిన్న వ్యాపారుస్తులకు తక్కువ వడ్డీతో రుణాలు అందిస్తామన్నారు. ప్రతేకంగా గుడివాడ నుండి 35 కిలో మీటర్ల వరకు ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో గృహ నిర్మాణాలు చేసుకునే వారికి రుణాలు త్వరితగతిన మంజూరుచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ నవీన్, ఎజిఎం రాజేంద్రప్రసాద్, చింతా రామయ్య(చిన్నా), సూర్య, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

పెదపారుపూడి : గుడివాడ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెద పారుపూడి హ్యాపీ హోమ్ వృద్ధుల ఆశ్రమంలో మామిళ్ళపల్లి నడిపినారపరెడ్డి, సాయమ్మ దంపతుల



పెళ్లి రోజు సందర్భంగా వృద్ధులకు అన్నదానం ఏర్పాటుచేశారు. ఈకార్యక్రమంలో అధ్యక్షులు నారాయణరెడ్డి, ట్రెజరర్ లక్ష్మీనారాయణ రెడ్డి, రామారావు, సత్యనారాయణరెడ్డి, మాజీ డిప్యూటీ గవర్నర్ దాసరి సుధాకర్, విఆర్ఒ సంఘం అధ్యక్షుడు చాట్ల అజయ్ కుమార్, మహిళా వాకర్స్ అధ్యక్షురాలు రమ్యారెడ్డి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో ప్రతిభ

ప్రజాశక్తి-ఉయ్యూరు

విద్యతో పాటు క్రీడలు, కరాటే ఇతర వ్యాయామ అంశాల పట్ల విద్యార్థులు ఆసక్తికనపరచడం ఎంతో ప్రయోజనకరమని



కరాటే సర్టిఫికెట్లతో విద్యార్థులు

ఉయ్యూరు పట్టణ ఎస్సై ఎన్.వీరప్రసాద్ అన్నారు. ఉయ్యూరు ఇంగ్లీషు మీడియం హైస్కూల్లో శనివారం చిన్నారులకు కరాటే బెల్ట్ టెస్టు నిర్వహించారు. 30మంది విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబర్చారు. ఎస్సై ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లు అందజేశారు. విద్యతో పాటు క్రీడలు, కరాటేలో విశేష ప్రతిభ కనపరుస్తున్నారని స్కూల్ డైరెక్టర్ ఎం కె బాబు తెలిపారు. కరాటే కోచ్ రామకృష్ణ, టెక్నికల్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

తనిఖీ అధికారి హడావుడి

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురైన సంఘటన మండలంలోని కవుతరం జిల్లా పరిషత్ హైస్కూల్లో శనివారం చోటుచేసుకుంది. విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం పదో తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రాల్లో ఒక పరిశీలన అధికారి పదేపదే ఎగ్జామ్ హాల్లోకి వెళ్లి పరిశీలించి విద్యార్థుల విలువైన కాలాన్ని వృథాచేశారని పేర్కొన్నారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

సరసమైన ధరలకే నాణ్యమైన కలప విక్రయం

తాడంకి బిస్మిల్లా టింబర్ డిపో అధినేత సయ్యద్ హుస్సేన్

ప్రజాశక్తి-పమిడిముక్కల

నాణ్యతా ప్రమాణాలతో కూడిన కలపకు సరసమైన ధరలకు వినియోగదారులకు అందజేస్తున్నామని బిస్మిల్లా టింబర్ డిపో అధినేత సయ్యద్ హుస్సేన్ చెప్పారు. పమిడిముక్కల మండలంలోని తాడంకిలోని టింబర్‌డిపోలో ఆయన ప్రజాశక్తికి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. టేకు, వేప, వెంగిస, మామిడి తదితర కలపను విక్రయిస్తున్నామని చెప్పారు. తాము టింబర్ డిపో ప్రారంభించిన నాటి నుంచి నాణ్యమైన కలపనే విక్రయిస్తున్నామన్నారు. నాటి నుంచి నేటి వరకూ అదే నాణ్యతా ప్రమాణాలను పాటిస్తున్నామన్నారు. కృష్ణాజిల్లా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాలతోపాటుగా బెంగళూరు, చెన్నై తదితర ప్రాంతాల నుంచి కూడా ఖాతాదారులు వచ్చి తమ కలపను కొనుగోలు చేస్తున్నారన్నారు. నాణ్యమైన కలపను వినియోగదారులకు అందజేస్తూ వారి మన్ననలను పొందుతున్నామన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం కొద్దిగా మందగించడంతో తక్కువ వ్యాపారం జరుగుతోందన్నారు. అది పుంజుకుంటే కలప వ్యాపారం కూడా బాగా పెరుగుతుందన్నారు. తమ వద్ద బర్మాటేకు కూడా అందుబాటులో ఉందని చెప్పారు. సరుకు విషయంలో ఎలాంటి రాజీ లేకుండా నాణ్యమైన కలపను



అందజేస్తున్నామనీ, అందువల్ల ఏటేటా తమకు ఆదరణ మరింతగా పెరుగుతోందన్నారు. తమ వద్ద కార్మికులకు కూడా మంచి ఉపాధిని కల్పిస్తున్నామన్నారు. ఆధునిక పరికరాలు రావడంతో చెక్క నైపుణ్యం కలిగే విధంగా తయారు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం కలప వ్యాపారులకు జీఎస్టీ విషయంలో కొంతమేర రాయితీ ఇస్తే బాగుంటుందన్నారు.



దాహార్తి తీర్చడానికి చలివేంద్రాలు దోహదం : దాసరి

ప్రజాశక్తి-గన్నవరం

వేసవిలో ప్రయాణికుల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని గన్నవరం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి వెంకట బాలవర్ధన రావు చెప్పారు. గన్నవరం కోనాయి చెరువు వద్ద గల శివాలయం వద్ద గ్రామ పెద్దలు కాసరనేని బాబురావు, బేబీ సరోజిని ఆధ్వర్యంలో కాసరనేని ధర్మారావు, సంపూర్ణమ్మ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని దాతలతో కలిసి దాసరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత గన్నవరానికి చెందిన పెద్దలు సామాజిక సేవా కార్యక్రమాలు చేయడంలో ఎప్పుడూ ముందు ఉంటారని పేర్కొన్నారు. మంచి కార్యక్రమాలు చేయడం ద్వారానే జీవితానికి సార్ధకత చేకూరుతుందని ఉద్ఘాటించారు. గ్రామ పెద్దలు కాసరనేని బాబురావు మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలు గత కొన్నేళ్లుగా చేస్తున్నట్లు వివరించారు. మొదటి రోజున 500 లీటర్ల మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గన్నవరం ఉపసర్పంచ్ పాలడుగు నాని, మాజీ ఉప సర్పంచ్ జాస్తి శ్రీధర్ రావు, జాస్తి ఫణికుమార్, శివాలయం కమిటీ పెద్దలు కె.నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. వేసవికాలం పూర్తయ్యే వరకూ చలివేంద్రం కొనసాగుతుందని బాబురావు తెలిపారు.

నాగాయతిప్పలో ఉపాధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి-మోపిదవి

మోపిదేవి మండల పరిధిలోని నాగాయతిప్ప గ్రామ పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పథకం పనులను సర్పంచ్ గరికిపాటి వెంకటేశ్వరరావు (బుల్లి) ప్రారంభించారు. ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ విశ్వనాథపల్లి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం పోచిగానిలంక వద్ద కరకట్ట సమీపంలో ఉపాధి హామీ పథకం పనులను సర్పంచ్ వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు సనకా వెంకట రాజేష్‌బాబు ప్రారంభించారు. పిఎసిఎస్ చైర్ పర్సన్ గరికిపాటి గోవిందరాజులు, మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ లింగం జగదీష్ కుమార్, పరిశే వెంకటేశ్వరరావు లతోపాటు కూలీలు తదితరులు పాల్గొన్నారు. బాతులంక రోడ్డులోని పుప్పాల సతీష్ బాబు పొలం వద్ద నుంచి కృష్ణానది అంచు వరకు గల మురుకుబోదు తవ్వకం పనులను ప్రారంభించారు. రెండు మీటర్ల వెడల్పు, అడుగు లోతుతో మూడు వేల మీటర్ల మేర రోడ్డుకు ఇరువైపులా మురుకుబోదు పనులు చేస్తున్నట్లు కిరణ్ కుమార్ తెలిపారు. పంచాయతీ పరిధిలో 200 మంది కూలీలకు 7వేల పని దినాలు కల్పించటానికి ప్రణాళికలు రూపొందించినట్లు కిరణ్ కుమార్ వెల్లడించారు.



పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ వెంకటేశ్వరరావు

అవనిగడ్డ-కోడూరు రహదారిని అభివృద్ధి చేయాలని టిడిపి నిరసన

ప్రజాశక్తి-కోడూరు

రాష్ట్ర ముఖ్యమంత్రి సైతం హామీ ఇచ్చిన అవనిగడ్డ–కోడూరు ప్రధాన రహదారి నిర్మాణం ఎప్పుడని టిడిపి నేతలు ప్రశ్నించారు. శనివారం అవనిగడ్డ–కోడూరు ప్రధాన రహదారి సమస్యపై శనివారం నిరసన తెలిపారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, కోడూరు రహదారి



నిర్మాణంపై ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను అసత్య ప్రచారాలతో నమ్మబలికే ప్రయత్నం చేస్తుండటం బాధాకరమన్నారు. కేవలం నేడు రూ.50 లక్షలతో రోడ్డు మరమ్మతులు చేయిస్తున్న వైసిపి నాయకుల తీరుపై ధ్వజమెత్తారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలకే దిక్కు లేకపోతే రాష్ట్రంలో పాలన ఏ విధంగా ఉందో ఒక్కసారి ప్రజలు ఆలోచించాలని కోరారు. మండల ప్రజలు ప్రతి ఒక్క విషయాన్ని గమనిస్తున్నారని వైసిపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందన్నారు. రోడ్లు అధ్వానంగా ఉండటంతో ప్రముఖ పర్యాటక కేంద్రమైన హంసలదీవి సాగర తీరానికి కూడా కాలక్రమేణా పర్యాటకులు తగ్గుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీలు కొల్లూరి వెంకటేశ్వరరావు, బండే శ్రీనివాసరావు, టిడిపి నాయకులు బండే రాఘవ, కాగిత రామారావు, బడే భావన్నారాయణ, మద్దూరి కాంతారావు, గుడిసేవ సూర్యనారాయణ, బడే గాంధీ, పోతబోయిన శ్రీనివాసరావు, కొప్పనాతి సత్యనారాయణ, బొడ్డు వెంకన్న, మేడా శివాజీ, బడే పిచ్చయ్య, కూరాకుల ప్రసాద్, గుంటూరు గిరి, సాయి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బండి రామకృష్ణ ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

కిడ్నీ బాధితురాలికి మచిలీపట్నం జనసేన పార్టీ ఇన్‌ఛార్జి బండి రామకృష్ణ రూ.10 వేలు నగదును ఆర్థిక సహకారంగా శనివారం అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ నగరపాలకసంస్థ పరిధిలోని 24వ డివిజన్ కుచెందిన డొక్కు శ్రీలక్ష్మికి అనారోగ్యం కారణంగా వైద్య పరీక్షలు నిర్వహించగా రెండు కిడ్నీలు పాడైపోయాయని వైద్యులు చెప్పారన్నారు. డయాలసిస్ ఆధారంగా జీవనం సాగిస్తున్న శ్రీలక్ష్మి కుటుంబపరిస్థితి దయనీయంగా మారిందనీ, భర్త రామ్మోహనరావు అందిన చోటల్లా అప్పుచేసి వైద్యం చేపించారన్నారు. వారికి కుమార్తె, కుమారుడు ఉన్నారన్నారు. వారు చదువులు మధ్యలోనే ఆపి తల్లికి తోడుగా పిల్లలు ఇద్దరూ రోజువారీ కూలీ పనికి వెళ్తే గాని కుటుంబం గడవని పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వపరంగా సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డం రాజు, వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ సమీర్, డివిజన్ ఇన్చార్జిలు గంపలకృష్ణ, మోకా రవి, దాదా, రామ్ జ్యోతి, తోట రాజేష్, లంకె శ్రీనివాస్, ఉడుముల బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



నగదు అందజేస్తున్న రామకృష్ణ



మంచి రాజకీయ వ్యవస్థకు తీరనిలోటు

కంచి రామారావు సంతాప సభలో ప్రముఖులు

ప్రజాశక్తి - తిరువూరు : రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్, తిరువూరు మాజీ సర్పంచ్ కంచి రామారావు మతి మంచి రాజకీయ వ్యవస్థకు తీరని లోటని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు, మాజీ సర్పంచ్ ఉయ్యూరు అనసూయ అన్నారు. స్థానిక శ్రీరస్తు పంక్షన్ హాల్‌లో శనివారం పసుపులేటి వెంకయ్య అధ్యక్షతన రామారావు సంతాప సభ జరిగింది. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈప్రాంత అభివద్ధికి ఎంతో కషిచేసిన మాజీ ఎంఎల్‌ఎ పేట బాపనయ్య కాంస్య విగ్రహాన్ని తిరువూరులో ఏర్పాటు చేయాలనే కోరిక రామారావుకు ఉందని, అది నేర వేరకుండానే ఆయన మరణించడం బాధగా ఉందని అన్నారు. రాజకీయాలకు అతీతంగా అఖిలపక్షంగా ఏర్పడి బాపనయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయించి రామారావు చివరి కోర్కెను తీరుద్దామని అన్నారు. రామారావు ఎంతో మందిని రాజకీయ నాయకులుగా తీర్చిదిద్దారని, ఆయన ఎప్పుడూ తిరువూరు నియోజకవర్గంలోని 360 చెరువుల అభివద్ధిని ఆకాంక్షించారని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో విజయవాడ ఎంపి కేశినేని శ్రీనివాస్, ఎంఎల్‌ఎ కొక్కిలిగడ్డ గడ్డ రక్షణనిధి, మాజీ ఎంఎల్‌ఎలు నల్లగట్ల స్వామిదాస్, వంగవీటి రాధా, ఎఎంసి చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, నగర పంచాయతీ చైర్‌పర్సన్ కె.కాస్తూరిబాయి, జడ్‌పిటిసి సభ్యులు రామచంద్రారెడ్డి, టిడిపి నాయకులు తాళ్ళూరి రామారావు తదితరులు కంచి చిత్ర పటానికి పూలమాలేసి నివాళులర్పించారు.

మొదటి పేజీ తరువాయి

తెంపల్లిలో అతిసార ?

ఇంటికీ పంపి ప్రతి ఒక్కరూ వారం రోజుల పాటు కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వేడి పదార్థాలు మాత్రమే తినాలని, పైపుల ద్వారా వచ్చే నీటిని నేరుగా తాగొద్దని కోరుతున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రచారం చేయించారు. మినరల్ వాటర్ ప్లాంట్లోని నీటిని తెచ్చుకుని తాగాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి విరోచనాలు, వాంతులు అవుతున్నాయా? జ్వరాలు ఉన్నాయా? ప్రశ్నించి వివరాలను అడిగి తెలుసుకుంటున్నారు. వాంతులైన వారికి మందులు ఇస్తున్నారు. నీరసంగా ఉన్న వారికి ఒఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నారు. అతిసార ప్రబలే ప్రమాదం ఉందని, నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. గ్రామంలో అతిసార ప్రబలిందనే ప్రచారం జరగడంతో గ్రామస్తులు తీవ్ర ఆందోళన చెందారు. ఇదే గ్రామంలో గత ఏడాది అతిసార లక్షణాలతో ముగ్గురు, జ్వరాలతో ఇద్దరు మరణించిన విషయం తెలిసిందే. గతంలో పరిస్థితి మళ్లీ వస్తుందేమోనని అధికార యంత్రాంగం ఆందోళన చెందుతోంది. అయితే వాంతులు, విరోచనాలు తగ్గుముఖం పట్టడంతో అధికారులు ఊపిరి పీల్చుకుంటున్నారు.

మంచినీటి సరఫరాకు చర్యలు : తెంపల్లి సర్పంచి శిరీష

తెంపల్లి గ్రామ గంగానమ్మ చెట్టు ప్రాంతంలోని ఇళ్లకు మంచినీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ కొలుసు శిరీష తెలిపారు. పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పనులను పర్యవేక్షిస్తున్నామని తెలిపారు.

చర్యలు తీసుకోవాలి : ఎంఎల్‌ఎ వంశీ

సర్పంచ్ శిరీష గ్రామంలో నెలకొన్న పరిస్థితిని ఎంఎల్‌ఎ వల్లభనేని వంశీ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు ఫోన్‌చేసి సత్వర చర్యలు తీసుకోవాలని కోరారు. తాత్కాలికంగా ప్రత్యేకమైన పైప్‌లైన్ ఏర్పాటు చేసి మంచినీటిని సరఫరా చేయాలన్నారు.

ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలి : సిపిఎం

తెంపల్లిలో అతిసార లక్షణాలు కనిపిస్తున్న దష్ట్యా ప్రభుత్వం వెంటనే నివారణకు చర్యలు చేపట్టాలని సిపిఎం గన్నవరం మండల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు కోరారు. ఇళ్లలోని మురుగునీరు బయటకు వెళ్లేందుకు వీలులేకుండా కొంతమంది కట్టడాలు నిర్మించారని, దీంతో మురుగునీరు పైప్‌లైన్‌లోకి వెళ్లి కలుషితం అవుతున్నట్లు స్థానికులు చెబుతున్నారని ఆయన వివరించారు. కొత్త పైపులైన్లు ఏర్పాటు చేయాలని కోరారు.

పంచాయతీని వెన్నాడుతున్న నిధుల సమస్య

మైనర్ పంచాయతీ అయిన తెంపల్లి నిధుల సమస్యను ఎదుర్కొంటోంది. పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు తీసుకుందామన్నా రూపాయి లేదని పాలకవర్గం చెబుతోంది. ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు కూడా రావడం లేదని వాపోతున్నారు. 5 వేల మంది జనాభా కలిగిన గ్రామానికి ఉన్నతాధికారులు వచ్చి పనులు చేయండని ఆదేశాలివ్వడమే తప్ప నిధులు కేటాయింపులో తాత్సారం చేస్తున్నారని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. అధికారుల ఒత్తిడిని అధిగమించడానికి సర్పంచ్ తన సొంత నిధులను ముందస్తుగా ఖర్చు పెట్టాల్సి వస్తోంది.

మతోన్మాద బిజెపిని తరిమికొడదాం

ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. చిట్టినగర్లో జరిగిన కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ రాష్ట్ర నాయకులు దోనేపూడి కాశీనాథ్, దోనేపూడి శంకర్, సిపిఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, సిపిఎం పశ్చిమ సిటీ కార్యదర్శి బోయి సత్యబాబు, నగర నాయకులు గాదె ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. సత్యనారాయణపురంలో జరిగిన కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి జి.కొటేశ్వరరావు, సిపిఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమణారావు తదితరులు పాల్గొన్నారు. ఊర్వశి సెంటర్లో జరిగిన కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.రమణారావు, డి.ప్రవీణ్, ఆర్ కోటేశ్వరరావు, కష్ణమూర్తి, ఎస్‌కె.ఆషా, ఎం శివ, సిపిఐ నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు, నాయకులు ఎ.వీరభద్రరావు, లంక దుర్గారావు, పి దుర్గా భవాని తదితరులు పాల్గొన్నారు

కృష్ణాజిల్లాను ఉన్నత స్థానంలో నిలబెట్టేందుకు కృషి : నూతన కలెక్టర్ పి.రాజాబాబు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : కృష్ణాజిల్లాను అన్ని రంగాల్లో ఉన్నత స్థానంలో నిలబెట్టేందుకు కృషి చేస్తానని నూతన కలెక్టర్ పి.రాజా బాబు అన్నారు. కష్ణాజిల్లా కలెక్టరుగా నియమితులైన ఆయన శనివారం మచిలీపట్నంలోని కలెక్టర్ ఛాంబర్లో బాధ్యతలు చేపట్టారు. కలెక్టరు రాజాబాబు తొలుత గ్రూప్‌- 1 ద్వారా 2000లో సిటిఒగా పోస్టింగ్ పొందారు. అనంతరం జాయింట్ కమిషనర్‌గా (జిఎస్‌టి) ఉద్యోగోన్నతి పొందారు. 2019లో ఐఎఎస్ కన్ఫర్మ్ అయ్యింది. 2013 బ్యాచ్ ఐఎఎస్‌గా నియమితులయ్యారు. తదుపరి పంచాయతీరాజ్ శాఖలో సెర్ప్ సిఇఒగా, చిత్తూరు జిల్లా జాయింట్ కలెక్టరుగా, ఎఫ్ ఐడిసి ఎమ్‌డిగా, రవాణాశాఖ కమిషనర్‌గా, గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. నూతన కలెక్టర్‌కు డిఆర్‌ఒ ఎం.వెంకటేశ్వర్లు స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం రాజాబాబు పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. జడ్‌పి సిఇఒ వీర్ల జ్యోతిబసు, ముడా విసి రాజ్యలక్ష్మి, ఆర్‌డిఒలు ఐ.కిషోర్, పద్మావతి, డిఆర్‌డిఎ పీడీ పిఎస్‌ఆర్ ప్రసాద్, డిఎస్‌పి మాసూంబాషా పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి జోగి రమేష్‌ను, జిల్లా జడ్జి అరుణా సారికను నూతన కలెక్టర్ మర్యాదపూర్వకంగా కలిశారు.

అందరి సహకారంతో జిల్లాలో అభివృద్ధికి కృషి : నూతన జెసి డాక్టర్ పి.సంపత్ కుమార్

ప్రజాశక్తి-విజయవాడ : ప్రజాప్రతినిధులు, అధికారులను సమన్వయం చేసుకుని ఎన్‌టిఆర్ జిల్లాను అభివృద్ధిపథంలో నడిపిస్తానని నూతన జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ అన్నారు. స్థానిక జెసి విడిది కార్యాలయంలో శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన కలెక్టర్ ఎస్ డిల్లీరావును మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన జెసిని సబ్ కలెక్టర్ అదితి సింగ్, డిఆర్‌వో కె.మోహన్‌కుమార్, డిఆర్‌డిఎ పీడీ కె.శ్రీనివాస్, డిపివో జె.సునీత, జిల్లా సర్వే అధికారి కె.సూర్యారావు, డిఎస్‌వో కోమలిపద్మ, కలెక్టరేట్ పరిపాలన అధికారి ఇంతియాజ్ పాషా, తహశీల్దార్లు సిహెచ్, దర్గాప్రసాద్, ఎం. మాధురి, వెంకట్రా మయ్య కలిసి శుభకాంక్షలు తెలిపారు.

మానవత్వం చాటుకున్న సిఐ కాశీ విశ్వనాథ్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : పటమట సీఐ కాశీ విశ్వనాథ్ మానవత్వాన్ని చాటుకున్నారు. వివరాల్లోకి శుక్రవారం రాత్రి మామిడికాయల లోడుతో వెళ్తున్న లారీ బెంజ్‌సర్కిల్ ఫ్లైఓవర్ పైనుంచి వేగంగా వచ్చి స్క్రూబ్రిడ్జికి రక్షణగా నిర్మించిన సిమెంట్ స్తంభాలను ఢీకొట్టి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో మూడేళ్ల బాలుడు సంజయ్ బోల్తాపడిన మామిడికాయల లారీ కింద ఇరుక్కుపోయి మరణించాడు. శనివారం ఉదయం బాలుడు మతదేహానికి సీఐ కాశీ విశ్వనాథ్ నివాళులర్పించి, వారి కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు.

IN THE COURT OF THE HON'BLE V ADDL DISTRICT JUDGE AT VIJAYAWADA
E.P.No. 1336/2018 IN A O.P. No. 143/2016

Between:
M/s. Shriram Transport Finance Co. Ltd., Rep. by its Authorized Signatory ... DHR/ Claimant

Vs

1. Koteswara Rao Duvvuri
2. Pidikiti Rathna Giri .... JDRs/ Respondents

NOTICE TO JDR No.1&2 /RESPONDENT

Koteswara Rao Duvvuri, S/o Madhusudhana rao, Dr. no 6-91, Edupu gallu, Kankipadu, Mandal, Krishna Dst-521151

Pidikiti Rathna Giri, S/o Veerabadhara Rao, D.No, 8-210, Thadigadapa, Penamaluru Mandal, Krishna Dst-521139

Take notice that the above Execution Petition filed by the DHR/Claimant praying orders against JDR 1&2. The same is posted to 19-04-2023 for your appearance on that day you should attend the court in person or through an advocate at 10-30 A.M. failing which the matter will be decided in your absence by the Hon'ble Court.

(By order of the Hon ble Court)

Pandiri Babu Rao,
Advocate,
Dr.No.27-22-28,
J.D. Hospital. Road,
Governorpet,
Vijayawada-520002,
Cell-9849695243

IN THE COURT OF THE HON'BLE V ADDL DISTRICT JUDGE AT VIJAYAWADA
E.P.No. 962/2019 IN A O.P. No. 328/2014

Between:
M/s. Shriram Transport Finance Co. Ltd., Rep. by its Authorized Signatory ... DHR/ Claimant

Vs

1. Maha Lakshmi Bokka
2. Peetala Vinayak.... JDRs/ Respondents

NOTICE TO JDR No.1&2 /RESPONDENT

Maha Lakshmi Bokka, W/o Venkatesh, Dr.No. 6/69, Near Panchayathi Office, Prasadampadu, Krishna - 521108.

Peetala Vinayak, S/o P.Dhanam, D.No. 41-1/14-648, Chalasani Nagar, Ranigari Thota, Ward No.-47, Vijayawada, Krishna - 520013

Take notice that the above Execution Petition filed by the DHR/Claimant praying orders against JDR 1&2. The same is posted to 20-04-2023 for your appearance on that day you should attend the court in person or through an advocate at 10-30 A.M. failing which the matter will be decided in your absence by the Hon'ble Court.

(By order of the Hon ble Court)

K.Naga Sridhar,
Advocate,
Dr.No. 30-19-6,
Chaparala vari Street,
Seetharampuram,
Vijayawada - 520 002.
Cell : 772342345.

IN THE COURT OF THE HON'BLE V ADDL DISTRICT JUDGE AT VIJAYAWADA
E.P.No. 1109/2018 IN A O.P. No.90/2015

Between:
M/s. Shriram Transport Finance Co. Ltd., Rep. by its Authorized Signatory ... DHR/ Claimant

Vs

Madhava Rao Koneru
Aneef Sheik ... JDRs/ Respondents

NOTICE TO JDR No.1&2 /RESPONDENT

Madhavarao Koneru, S/o Koteswara Rao, D.No. 8-94, NH5 North side, Janda chettu, Estren Enikepadu, Vijayawada-521137.
Aneef Sheik, S/o Gali Saheb, D.No. 1-84/4, Thadigadapa, Penamaluru Mandalam, Thadigadapa, Krishna District.

Take notice that the above Execution Petition filed by the DHR/Claimant praying orders against JDR 1&2. The same is posted to 17-04-2023 for your appearance on that day you should attend the court in person or through an advocate at 10-30 A.M. failing which the matter will be decided in your absence by the Hon'ble Court.

(By order of the Hon ble Court)

D.Anjaneya Prasad,
Advocate,
Shop No. #21, First Floor,
Sai Krishna Devaraya Shoping Complex,
Opp. Swagruha Foods, Rehman Street,
Eluru Road, Vijayawada.
Cell : 9866104927.

మహారాజశ్రీ 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
ఒ.యస్. 1213/2021

చింతా వెంకటేశ్వర్లు - వాది

వర్సెస్

జలరాజు, S/o. గోపాలరావు
డోరు : 46-4-110 : అంబేద్కర్ విగ్రహం దగ్గర, బెత్‌లెహమ్ నగర్, గుణదల, విజయవాడ - ప్రతివాది

పై దావాలో ప్రతివాది తనకు దిగువ షెడ్యూలు ఆస్తిలో గల 4 వంతు ఆస్తిని వాదికి విక్రయించుటకు ఖరారు పడి రూ. 10,75,000/-లు పూర్తి క్రయ ప్రతిఫలం స్వీకరించి తేది 28.12.2020 న విక్రయ అగ్రిమెంటును వాది పేర వ్రాయించి యిచ్చి వుండి వాదిగారిచే అడుగబడియుండి కూడా వాది గారు రిజిష్టరు చేయించుకొనుటకు సిద్ధముగా వున్నానని తెలిపినా కూడా విక్రయ దస్తావేజు రాసి, రిజిష్టరు చేయుటకు రానందున వాది గారు శ్రీ కోర్టు వారి ఎదుట దావా దాఖలు చేసి ప్రతివాది విక్రయ దస్తావేజు రాసి రిజిష్టరు చేయులాగున ఆదేశిస్తూ ఉత్తర్వులు కోరియుండగా ప్రతివాది గారి నోటీసు నిమిత్తం వాయిదా **తేది 25-04-2023** కి వున్నందున ప్రతివాది ఆరోజు ఉదయం గం. 10.30 ని.లకు శ్రీ కోర్టువారి ఎదుట స్వయంగా గాని, లాయరు గారి ద్వారా గాని హాజరు కాగలందులకు తెలుపడమైనది. లేనిచో ప్రతివాది పరోక్షముగా విని తీర్పు యివ్వబడునని తెలుపడమైనది.

షెడ్యూలు :

దిగువ హద్దుల మధ్యస్తమైన, విజయవాడ కార్పొరేషన్ పరిధిలోని గుణదల బెత్‌లెహమ్ నగర్, డోరు నెంబరు 46-4-110 గల 148 చ.గ ల విస్తీర్ణములో గల బిల్డింగులో 4 వంతు

తూర్పు : మునిసిపల్ రోడ్డు
దక్షిణం : శ్రీ ధనరాజు గారి ఆస్తి
పడమర : శ్రీ కె. సుబ్బారావు గారి ఆస్తి
ఉత్తరం : రోడ్డు

ఇట్లు,
వేముల హజరత్తయ్య గుప్తా
న్యాయవాది
గాంధీ నగర్, విజయవాడ-3,
సెల్ నెం. 9848122167

పట్టాదారు పాస్ పుస్తకం పోయింది

ఎన్టీఆర్ జిల్లా, వత్సవాయి మండలం, సింగవరం గ్రామానికి చెందిన చింధు శ్రీనివాసరావు తండ్రి నారాయణ తన గ్రామం నుండి మండల కేంద్రమైన వత్సవాయి తాసిల్దార్ కార్యాలయం కు బైక్ పై వెళుండగా మార్గమధ్యలో పట్టాదారు పాస్ పుస్తకం పోయింది ఆర్.ఎస్.నెంబర్ 187/3లో 94 సెంట్లు భూమి కలదు. ఖాతా నెంబర్ 868, పాస్‌బుక్ నెంబర్ 06102M017000306 కు నమోదయింది. పాస్ పుస్తకం దొరికిన వారు ఈ క్రింది అడ్రస్ కు తెచ్చి ఇవ్వగలరు. ఇట్లు

చింధు శ్రీనివాసరావు, తండ్రి నారాయణ,
సింగవరం గ్రామం, వత్సవాయి మండలం
ఎన్టీఆర్ జిల్లా, సెల్ నెంబర్ : 8332013848.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, VIJAYAWADA
E.P.No. 202/2019
Arbitration Claim Petiton No. 263/2017

Between:
Margadarsi Chit Fund Pvt. Limited, Rep. by it□s Sr. Manager Cum Foreman Labbipet, Vijayawada-10. ..Decree Holder.
And
M/s Sree Shades & Others ... Judgement Debtors

Judgement Debtor No.2

Mr. Godavarthi Srinivasa Raju, S/o G.Venkata Rama Raju, D.No. 21-10/5-65C, V Lane, Srinagar, Satyanarayana puram, Vijayawada.

Please take R-43 Notices that the above said Execution Petiton filed by the Decree Holder for Recovery of Rs.11,92,279/- with subsequent interest,costs, etc., posted to 20-06-2023 for your appearance. In case of your failure to appear before the Hon□ble court at 10-30 AM on 20-06-2023 either in person or through an advocate failing which the matter will be decided exparte.

(By court order)

Vijayawada
Dr.08-04-2023

Sunkara Rajendra prasad,
Advocate for Decree Holder,
33-14-2A, Kadiyalavari street,
Seetarampuram,
Vijayawada- 520 002.

Before The Honourable Deputy Registrar Of Chits at Nellore
(Application for reference of a Dispute)
Dispute No. 235 of 2021

M/s. Sri Sai Anjana Chit Funds India. Pvt., Ltd., Kavali Branch, Rep.by its Legal Officer, **Shaik Magbul Basha,** Being authorized person ... Disputant.

Versus

1. Mr. **V. Raju**
and 3 Others ... Opponents.

Notice

To,
Opp-4. Mr. **Sarihaddu Krishna,** S/o **Seshagiri Rao,** Occ: Jr Asst, AP R& B Depot. R/o D.No. 15-183, S.V.S Nagar, Mylavaram, Krishna District.

పై నెంబరున డిస్‌ప్యూటెంట్ మీ నుండి చిట్ బాకీ బ్యాలెన్స్ మొత్తం రాబట్టుకొనుటకు పైన తెలిపిన డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్, నెల్లూరు వారి ఆఫీసులో కేసు దాఖలు చేసియున్నారు. సదరు కేసు లో మీకు నోటీసునిమిత్తం **తే18-04-2023**దికి వాయిదా వేసియున్నారు.కావున వాయిదా రోజు **ఉదయం 11.00 గంటలకు** మీరు స్వయంగాగానీ లేదా వకీలు ద్వారాగానీ పైన తెలిపిన డిప్యూటీ రిజి స్ట్రార్ ఆఫ్‌చిట్స్, నెల్లూరు వారి ఆఫీసులో హాజరై ఆక్షేపణలు తెలుపు కోవలసినది. లేనియెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

సయ్యద్ సిరాజుద్దీన్, బి.ఎస్‌సి., బి.ఎల్.,
కె.నవకోటి, బి.కాం., ఎల్.ఎల్.బి,
డిస్‌ప్యూటెంట్ తరపు అడ్వకేట్స్, నెల్లూరు.

చంద్రబాబు పర్యటన విజయవంతం : కొనకళ్ల

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో మూడురోజులపాటు జరిగిన టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు పర్యటన విజయవంతమైంని ఆపార్టీ కృష్ణాజిల్లా అధ్యక్షులు కొనకళ్ల నారాయణరావు వెల్లడించారు.

గుడివాడ : గుడివాడలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమంలో పోటెత్తిన ప్రజల ప్రభంజనాన్ని చూసి కొడాలి నానికి ఓటమి భయం పుట్టిందని మాజీ



మాట్లాడుతున్న రావి వెంకటేశ్వరరావు

ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరావు విమర్శించారు. శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు సభను విజయవంతం చేసిన టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు అభినందనలు తెలిపారు. చంద్రబాబు సభను చూసిన కొడాలి నానికి పిచ్చెక్కినట్లుగా మాట్లాడుతున్నారన్నారు. నిమ్మకూరులో విగ్రహాలను జూనియర్ ఎన్‌టిఆర్ ఏర్పాటుచేశారన్నారు. కొడాలి నాని 2004లో రాజకీయాల్లోకి వచ్చారన్నారు. అప్పటికి చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నారన్నారు. గుడివాడలోని వాంబే కాలనీ, ఇందిరనగర్ కాలనీ, మందపాడు కాలనీ, శ్రీకాళహస్తి కాలనీలకు భూముల కేటాయింపు చేసింది చంద్రబాబేనన్నారు. 2014 నుండి 2019 వరకు సుమారు రూ.700 కోట్లు గుడివాడకు నిధులు తీసుకొచ్చామన్నారు. పట్టణంలో 235 సిసి రోడ్లు, గ్రామీణ ప్రాతాల్లో రూ.100 కోట్లు ఖర్చు పెట్టి సిసి రోడ్లు, 600 కల్వర్లు నిర్మాణం చేయించామన్నారు. మంత్రిగా ఉండి కూడా కొడాలి నాని కనీసం విజయవాడ-కంకిపాడు రోడ్లను వేయించలేకపోయారన్నారు. ఈ సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్షులు దింట్యాల రాంబాబు, నాయకులు పోలాసి ఉమా, కంచర్ల సుధాకార్, కనకబరం, నిమ్మగడ్డ కృష్ణారావు, షణ్ముకం, కోలవెన్ను కృష్ణ, విశ్వనాథరావు పాల్గొన్నారు.

చంద్రబాబు పాలన రావాలి

ప్రజాశక్తి-గన్నవరం (హనుమాన్ జంక్షన్)

రాష్ట్రంలో వైసిపి పాలన అధ్వానంగా ఉందనీ, తిరిగి చంద్రబాబు పాలన రావాలని టిడిపి బాపులపాడు మండల అధ్యక్షులు దయాల రాజేశ్వరరావు, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి చిరుమామిళ్ల సూర్యం, రాష్ట్ర తెలుగురైతు కార్యనిర్వాహక కార్యదర్శి గుండపనేని ఉమా వరప్రసాద్ కోరారు. బాపులపాడు



హనుమాన్‌జంక్షన్‌లో మాట్లాడుతున్న నాయకులు

మండల టిడిపి కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడారు. చంద్రబాబు పర్యటనను విజయవంతం చేసినందుకు నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. గన్నవరం,నూజివీడు మెట్ట ప్రాంతానికి గోదావరి జలాలను తీసుకొచ్చే చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని వైసిపి ప్రభుత్వం మూలన పడేసిందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ నాయకులు వేములపల్లి శ్రీనివాసరావు, చెన్నుబోయిన శివయ్య , యనమదల వెంకయ్య రావు ,వేగిరెడ్డి పాపారావు, జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకులు గండేపూడి నితీష్ కుమార్, మందాడి రవీంద్ర ,మజ్జిగ నాగరాజు, మండల తెలుగుదేశం పార్టీ నాయకులు చలసాని శ్రీనివాసరావు,కొండపల్లి వెంకటేశ్వరరావు, గుమ్మడి శేషగిరిరావు, యలమంచిలి శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సిఎం హామీ కూడా అమలు కాదా : టిడిపి


ప్రజాశక్తి-అవనిగడ్డ

ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేలు ఇచ్చిన హామీలు కూడా అమలు జరగకపోవటం బాధాకరమని టిడిపి నాయకులు విమర్శించారు. అవనిగడ్డ-కోడూరు మండలాలకు చెందిన టిడిపి నాయకులు అవనిగడ్డ-కోడూరు రహదారిని పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. రూ.35 కోట్లతో అవనిగడ్డ-కోడూరు రహదారి నిర్మాణం చేపడతామని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ప్రజలకు ఇచ్చిన హామీ అమలయ్యేనా లేక అసత్యాల అంటూ తెలుగుదేశం పార్టీ నాయకులు ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, కోడూరు మండల పార్టీ అధ్యక్షులు బండే శ్రీనివాసరావు, కాగిత రామారావు, ఘంటసాల రాజమోహనరావు, యలవర్తి చిన్న, బండే రాఘవ, పలువురు అవనిగడ్డ, కోడూరు మండలాల టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రజలు, నాయకులకు ధన్యవాదాలు : కొనకళ్ళ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

వరుసగా మూడు రోజులు పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు కృష్ణాజిల్లాలో పర్యటించి వివిధ వర్గాలతో ముచ్చటించి ప్రజలు, నాయకులు, కార్యకర్తల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు నిర్వహించిన 'ఇదేం మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు టిడిపి జిల్లా అధ్యక్షులు, మాజీ పార్లమెంట్ సభ్యులు కొనకళ్ల నారాయణరావు



ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో పర్యటించి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చి తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకుల్లో నూతన ఉత్సాహాన్ని తీసు కొచ్చారన్నారు. చంద్రబాబు రాక కోసం అర్ధరాత్రి 12 గంటల వరకు ఎదురుచూసిన కృష్ణాజిల్లా ప్రజలను చూస్తుంటే వైసీపీ ప్రభుత్వంపై ఎంత వ్యతిరేకత ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. గుడివాడలో నిర్వహించిన పాస్టర్ల ఆత్మీయ సమావేశంలో జిల్లాలోని పాస్టర్లు అందరూ ఈ వైసీపీ ప్రభుత్వం వల్ల వారు పడుతున్న ఇబ్బందులను చంద్రబాబు నాయుడు చెప్పుకొని రానున్న రోజులో మద్దతుగా ఉంటామని హామీ ఇచ్చారన్నారు.

'సాంకేతిక సమస్యల పరిష్కారానికి చర్యలు'

కలెక్టరేట్ : ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు సంబంధించిన గణాంకాల నమోదులో వచ్చే సాంకేతిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నామని రాష్ట్ర అర్థ గణాంక శాఖ సంచాలకులు బి.గోపాల్ అన్నారు. మచిలీపట్నంలోని జిల్లా అర్థ గణాంక శాఖ కార్యాలయంలో పంటల సాగు విస్తీర్ణంలు-ఈక్రాఫ్ నమోదులో సమస్యలు అనే అంశంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. వ్యవసాయం చేస్తున్న రైతులు తాము పండిస్తున్న రైతులకు భరోసా రావాలంటే ఈ క్రాఫ్ నమోదు కావాల్సివుందన్నారు. తద్వారా ఎలాంటి ప్రకృతి విపత్తులు, వరదలు,




మాట్లాడుతున్న గోపాల్

తుఫాన్లు వంటివి వచ్చిన సమయంలో బాధిత రైతులకు పరిహారం అందే అవకాశం ఉంటుందన్నారు. తాము పండించిన పంటలను రైతులు మార్కెట్లో అమ్ముకోవటానికి సులభమైన అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్రప్రభుత్వం ద్వారా గిట్టుబాటు ధరలు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈక్రాఫ్ నమోదు జరిగిందన్నారు. నమోదులో ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. డిపార్ట్మెంట్ అంశాలపైనా జిల్లా, డివిజన్ ఉప గణాంక అధికారులు, మండల సహాయ గణాంక అధికారులతో సమీక్ష చేశారు. సమావేశానికి జిల్లా అర్థ గణాంకశాఖ అధికారి వై.శ్రీలత, రాష్ట్ర అర్థ గణాంక శాఖ ఉప సంచాలకులు కె. సౌజన్య, ఉప గణాంక అధికారి శేషు బాబు, జిల్లాలోని అర్థ గణాంక శాఖకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీలు సెస్ బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి-గన్నవరం

గ్రంథాలయాల అభివృద్ధికి పంచాయితీలు సహకరించాలని, వాటి నుంచి రావాల్సిన సెస్ బకాయిలు సీఎఫ్ఎంఎస్ ద్వారా త్వరిత గతిన చెల్లించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వేములపల్లి రవికుమార్ కోరారు. స్థానిక గ్రేడ్-1 గ్రంథాలయాన్ని శనివారం అకస్మికంగా సందర్శించారు. పాఠకులతో మాట్లాడి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ పాఠకుల అభిరుచి మేరకు పుస్తకాలను, వార్తా పత్రికలను, పోటీ పరీక్షల మెటీరియల్‌ను అందుబాటులో



రికార్డులను పరిశీలిస్తున్న రవికుమార్

ఉంచామన్నారు. త్వరలో గన్నవరం గ్రంథాలయంలో జిరాక్స్ మెషిన్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వచ్చే ఏడాదికి కంప్యూటర్ ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. గ్రంథాలయాల్లో విలువైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంథాలయ ఇన్చార్జి దొండపాటి బాబూరావు, రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు

విద్యుత్ విజిలెన్స్ అధికారుల తనిఖీలు

ఉయ్యూరు : ఉయ్యూరు పట్టణంలో విద్యుత్ విజిలెన్స్ అధికారులు శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించి అదనపు లోడు వాడుతున్న 193 సర్వీసులకు రూ.6,65,200 నోటీసులు ఇచ్చి విద్యుత్ చౌర్యానికి సంబంధించి రూ.40వేలు అపరాధ రుసుంగా విధించామని విద్యుత్ శాఖ ఉయ్యూరు డివిజన్ ఈఈ సీహెచ్ రాంబొట్లు తెలిపారు. విజిలెన్స్ ఈఈ కె.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అధికారులు 31 బృందాలుగా ఏర్పడి 2069 గృహ, 249 వాణిజ్య సముదాయాల సర్వీసులు తనిఖీచేశారు. అందులో 193 సర్వీసులకు అదనపు లోడుగా 270 కిలోవాట్స్‌కు పైమొత్తానికి నోటీసులు అందించినట్లు తెలిపారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఉయ్యూరు, చల్లపల్లి, అవనిగడ్డ సబ్ డివిజన్లకు సంబందించిన డీఈఈలు, ఏఈలు, జేఈలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, విజిలెన్స్ డీఈఈలు, ఏఈలు పాల్గొన్నటు తెలిపారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న రమేష్‌బాబు

చలివేంద్రాల ఏర్పాటు

ప్రజాశక్తి-అవనిగడ్డ

ఎండల తీవ్రత అధికం కావడంతో అవనిగడ్డలో బాట సారుల కోసం పలుచోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. అవనిగడ్డ ప్రధాన రహదారి రామాలయం వద్ద శ్రీ లంకమ్మ అమ్మవారి దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ అన్నపురెడ్డి రామదాసు వారి తండ్రి పెద్దబ్బాయి జ్ఞాపకార్థం ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల రైతు విభాగం సమన్వయకర్త కడవకొల్లు నరసింహారావు శనివారం ప్రారంభించారు. మొదటి రోజు బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, మండల పార్టీ కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, పార్టీ నాయకులు తుంగల అంకారావు, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు షేక్ నజీర్ భాష తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర విపత్తుల శాఖ ఆదేశాల మేరకు ఎండ తీవ్రత దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కూడా కళాశాల వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు చలివేంద్రాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.ఉమారాణి ప్రారంభించారు ఈ కార్యక్రమంలో వాణిజ్యశాఖ అధ్యాపకులు అంకారావు, టి.దీన ఎలిజిబెత్, డాక్టర్ సిహెచ్ నాగరాజు, శేషగిరిరావు వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె వి శాంతకుమారి, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు

కూలీలకు రక్షణ చర్యలు చేపట్టాలి

వ్యకాస సైకిల్ ర్యాలీలో నాయకులు

ప్రజాశక్తి-బంటుమిల్లి

ప్రస్తుతం వేసవి ఉధృతి ఎక్కువగా ఉన్నందున వ్యవసాయ కూలీలకు రక్షణ నిమిత్తం చర్యలు తీసుకోవాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మురాల రాజేష్, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చౌటుపల్లి రవి, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు, ఎపి మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి శ్రీనివాసరావు రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం కృష్ణాజిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం కార్మికుల సమస్యలపై అధ్యయనం నిమిత్తం శనివారం సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధి హామీ పరిరక్షణ కోసం ఈ సైకిల్ యాత్ర చేపట్టామన్నారు. సిఐటి నాయకులు మాజేటి శివ శ్రీనివాసరావు, జయరావు, కౌలు రైతు సంఘం నాయకులు బివి శ్రీనివాస్, డివైఎఫ్ఐ నాయకులు బాజీ బాబు, సిఐటియు నాయకులు ఆర్ సి పి రెడ్డి, లంకదాసుల అజయ్‌ఘోష్; నాగిశెట్టి చంద్రశేఖర్, బొడ్డు నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ యాత్ర బంటుమిల్లి, ములపర్రు, జయపురం, పెద్ద తుమ్మిడి, నరసప్ప చెరువు, ఉరివి గ్రామాల్లో పర్యటించింది. ఆయా గ్రామాల్లో పనులు చేస్తున్న ఉపాధి హామీ పథకం పనిప్రదేశానికి వెళ్లి కూలీలతో నాయకులు మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న నాయకులు

ఉత్సాహంగా రెడ్‌ఎఫ్‌ఎం 93.5 సాంస్కృతిక పోటీలు



ప్రజాశక్తి-ఎడ్యుకేషన్ : రెడ్ ఎఫ్ఎం 93.5 ఆధ్వర్యంలో నగరంలోని ఎస్ఆర్‌కె ఇంజనీరింగ్ కళాశాలలో రెడ్ ఎఫ్ఎం కాలేజ్ రాక్‌స్టార్ గ్రాండ్ ఫైనల్ కార్యక్రమాన్ని శనివారం కళాశాల ఆవరణలో నిర్వహించారు. ఈసందర్భంగా వివిధ కళాశాలల నుండి పెద్ద సంఖ్యలో విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. ఈసందర్భంగా రెడ్ ఎఫ్ఎం స్టేషన్ హెడ్ క్రాంతి కుమార్ మాట్లాడుతూ కళాశాల విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడానికి రెడ్ ఎఫ్ఎం వివిధ పోటీలను నిర్వహిస్తుందన్నారు. ఇందులో భాగంగా సంప్రదాయ ఆధునిక వస్త్రధారణ పోటీలు, పలు సాంస్కృతిక పోటీలతో పాటు ర్యాంప్ వాక్ కార్యక్రమాన్ని నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎకాంబరం నాయుడు, ప్రోగ్రామింగ్ హెడ్ ఆదిల్ భాష, ఆర్జే ఆర్య, ఇస్మార్ట్ స్వీటీ, అన్యలు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-నందిగామ : నందిగామ పట్టణంలోని పల్లగిరి గట్టుపై ఉన్న వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభమైయ్యాయి. ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు కొత్తా హనుమేశ్వరరావు, రాయపాటి రమేష్,కమిటీ సభ్యులు పర్యవేక్షణలో ఆలయ అర్చక స్వాములు పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 150 మంది దంపతులు శ్రీ వారి కళ్యాణ ఉత్సవాల్లో పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

సహజ పానీయాలతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి - తిరువూరు : వేసవికాలంలో పెప్సీ, థమ్సప్ వంటి కత్రిమ పానీయాల కంటే, మజ్జిగ, కొ బ్బరి బోండం, నిమ్మరసం వంటి సహ జ పానీయాలు ఆరోగ్యానికి మేలు చే స్తాయని జనవిజ్ఞాన వేదిక(జెవివి) జి ల్లా ప్రధానకార్యదర్శి ఎల్. గంగాధర్ అన్నారు. శనివారం తిరువూరులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శీతల పానీయాలు-నష్టాలు అనే అంశంపై జన విజ్ఞాన వేదిక రూపొందించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ శీతల పానీయాలు సేవిస్తే ఆరోగ్యం దెబ్బ తినడంతో పాటు,డబ్బు కూడా వథా అవుతుందని వివరించా రు. ఈకార్యక్రమంలో జెవివి నాయకు లు ఎం. రాంప్రదీప్, కడిమి పాపారావు, డి.సుదర్శన్, ఎం.నాగేంద్ర ప్రసాద్, సిఐ టియు మండల కార్యదర్శి బి.వెంక టేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ నాయకులు ఎ. గణేష్, కె.రాహుల్ ప్రజా సంఘాల నాయకులు ఎం.ప్రభాకర్ ,ఎస్.వెంకటే శ్వర్లుతదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ కిట్లు పంపిణీ



ప్రజాశక్తి-కంచికచర్ల : కంచికచర్ల అరుంధతి కాలనీ యువతకు స్థానిక పట్టణ వైసిపి అధ్యక్షుడు, గ్రామ ఉప సర్పంచ్ వేమా సురేష్ బాబు శనివారం క్రికెట్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలో శారీరిక దఢత్వానికి క్రీడలు దోహదపడ తాయన్నారు. ఎంపిటిసి మాధుగుల మధు, పంచాయతీ వార్డు సభ్యులు గ్రంధి ఆదిత్య, గొ్రెపాటి రాజేష్‌పాల్గొన్నారు.

చిరు ధాన్యాలతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలి

● ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు



ప్రజాశక్తి-విజయవాడ : న్యూట్రిషయన్‌కు మిల్లట్స్ బుల్లెట్‌లాంటివని, భవిష్యత్ తరాలకు చిరుధాన్యాల వినియోగమే కీలకమని చిరుధాన్యాలను ఉపయోగించి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు తెలిపారు. చిరుధాన్యాల వినియోగంపై గొల్లపూడిలోని టిటిడిసి భవనంలో శనివారం నిర్వహించిన మిల్లట్స్ మహోత్సవ్ 2023 కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చిరుధాన్యాలపై ఏర్పాటు చేసిన ప్రదర్శనను ప్రారంభించిన అనంతరం స్వయం సహాయక బృందాల మహిళలతో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణలో చిరుధాన్యాలు కీలక పాత్ర పోషిస్తున్నా యన్నారు. మన ముందు తరం వారు చిరుధాన్యాలను వినియో గంచడం వలన ఇప్పటికి ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడుపుతున్నారన్నారు. చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో దోహదపడతాయన్నారు. రానున్న కాలంలో చిరుధాన్యాల వినియోగమే కీలకంగా మారబోతుందన్నారు. రక్త హీనత, థైరాయిడ్, మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధులు అరికట్టేందుకు చిరుధాన్యాల వినియోగం ఎంతో దోహదపడతాయన్నారు. మన పూర్వీకులు రాగి జావ, రాగి సంకటి, రాగి ముద్ద, జొన్న అన్నంలను ఉపయోగించడం ద్వారా దీర్ఘకాలం ఎటువంటి వ్యాధులకు గురి కాకుండా ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడిపారన్నారు. అనంతరం స్వయం సహాయక బృందాల మహిళలు సైనిక సంక్షేమ నిధికి సేకరించిన 4 లక్షల 17 వేల రూపాయల చెక్‌ను జిల్లా కలెక్టర్ డిల్లీరావు ద్వారా జిల్లా సంక్షేమ అధికారి డా. వీణాకు అందజేశారు.కార్యక్రమంలో డిఆర్‌డిఎ పిడి కె. శ్రీనివాస్, ఐసిడిఎస్ పిడి జి. ఉమాదేవి, వ్యవసాయ శాఖ జెడి నాగమణమ్మ, జడ్పిఎన్ఎఫ్ జిల్లా పిడి విజయకుమారి, జిల్లా ఉద్యాన అధికారి బాలాజీ కుమార్, జిల్లా సైనిక సంక్షేమ అధికారి డా.వీణా జిల్లా సమైఖ్య అధ్యక్షురాలు కె.సీత, స్వయం సహాయక బృందాల మండల అధ్యక్షులు, సిపిలు, ఎఫ్‌డివోలు, మహిళలు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డిప్యూటీ సిఎం

ఇఫ్తార్ విందు ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి-విజయవాడ : పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వ తరుపున ముస్లీమ్ సోదరులకు ఈనెల 17వ తేదీన నిర్వహించే ఇఫ్తార్ విందుకు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేసి సర్వం సిద్దం చేయాలని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి ఎస్ బి అంజాద్ బాషా అధికారులు ఆదేశించారు. ఈనెల 17వ తేదీన విద్యాదరపురం బైపాస్ రోడ్డులో గల ఆర్‌టిసి వర్క్ షాపు రోడ్డులో గల స్టేడియంలో నిర్వహించనున్న ఇఫ్తార్ విందు ఏర్పాట్లను శనివారం ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా, జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు, శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావులు సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్య మంత్రి ఎస్‌బి అంజాద్ బాషా మాట్లాడుతూ విద్యాదరపురం స్టేడియం గ్రౌండ్ నందు నిర్వహించే ఇఫ్తార్ విందుకు ముఖ్య మంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య అతిధిగా హాజరు కానున్నట్లు తెలిపారు. సాయంత్రం 5 గంటల నుండి ముస్లీం సోదరులు ఇఫ్తార్ విందుకు హాజరు కానున్నారన్నారు. కలెక్టర్ ఎస్ డిల్లీరావు, సబ్ కలెక్టర్ అదితి సింగ్, శాసన మండలి సభ్యులు యండి రూహుల్లా, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-అజిత్‌సింగ్‌నగర్ : స్థానిక శాంతినగర్‌లోని శారదాస్కూల్‌లో మహిళా ఆటోడ్రైవర్ కుంచం జమలమ్మకి అలాగే కొందరు పేదలకు విజయవాడ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ సిఐటియు, సిపిఎం ఆధ్వర్యంలో బియ్యం, కూరగాయలు, చీర, నిత్యావస రాలను శనివారం పంపినీ చేశారు. శారద స్కూల్ కన్వీనర్ పి. అప్పలరాజు, సిపిఎం పార్టీ ఎన్.టి.ఆర్ జిల్లా కమిటీ సభ్యులు కె. దుర్గారావు చేతుల మీదుగా ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో శారద స్కూల్ హెచ్.ఎంలు ఎం. సురేఖ ఇంగ్లీష్ మీడియం, టి. శారద తెలుగు మీడియం, సిపిఎం పార్టీ సెంట్రల్ సిటీ కమిటీ సభ్యులు సి.హెచ్ శ్రీనివాస్, విజయవాడ సెంట్రల్ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ సిఐటియు ప్రధాన కార్యదర్శి ఎం. హనుమంతరావు, కోశాధికారి ఎ. నాగబ్రహ్మం, నాయకులు ఉప్పు దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



మంచినీటి సమస్య పరిష్కారానికి వినతి

ప్రజాశక్తి -తిరువూరు : విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శ్రీనివాస్ (నాని)కి తిరువూరు నగర పంచాయతీకి చెందిన టిడిపి కౌన్సిలర్లు హుస్సేన్, నాళ్ల సురేంద్ర, జీడీమళ్ళ సత్యవతి అపార్టీ నాయ కులతో కలిసి వినతిపత్రం అందజేశారు. శనివారం తిరువూరు వచ్చిన ఎంపికి వేసవికాలంలో మంచి నీటి సమస్య ఉందని, తమ నిధుల నుండి పట్టణానికి ఐదు వాటరు ట్యాం కర్లు, మూడు ట్రాక్టర్ ఇంజన్లు మంజూ రు చేయాలని కోరారు. వీటిని తప్పని సరిగా మంజూరు చేస్తానని నాని హామీ ఇచ్చారు. పోతుల చెరువు దగ్గర నుం డి సోమకుంట చెరువు కట్ట వరకు సిసి రోడ్డు నిర్మాణానికి కూడా నిధులు మంజూరు చేస్తానని చెప్పారు. ఈకా ర్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామిదాస్, మాజీ ఎఎంసీ చైర్మన్ తాళ్లూరి రామారావు, నాయకులు బొమ్మసాని ఉమా మహేష్, వాసం మునియ్య, ఎస్. జయసింహా తదిత రులు పాల్గొన్నారు.



మామిడి రైతుపై 'యూజర్' భారం

ఇటీవల కురిసిన అకాల వర్షాలు, ఈదురుగాలకు తీవ్రంగా నష్టపోయిన మామిడి రైతులపై మరో 'పిడుగు' పడేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. అకాల వర్షాలు, ఈదురు గాలులకు మామిడికాయలు రాలిపోయి రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. పెట్టుబడి కోసం చేసిన అప్పులు ఏ విధంగా తీర్చాలో తెలియక తీవ్ర ఆందోళనలో ఉన్నారు. పంట చేతికొచ్చే సమయంలో రైతులకు ఈ వర్షాలు కన్నీరు మిగిల్చాయి. మరికొన్ని రోజుల్లో మామిడి కాయలను కోసి మార్కెట్‌కు తరలించేందుకు రైతులు సిద్ధమవుతున్న సమయంలో ప్రకృతి ఒక్కసారిగా కన్నెర్ర చేసింది. ప్రకృతి ప్రకోపానికి గురైన మామిడి రైతులు కోట్లాది రూపాయల మేర నష్టపోయారు. ఎన్‌టిఆర్ జిల్లాలోని ఎ.కొండూరు, విస్సన్నపేట, రెడ్డిగూడెం, మైలవరం, తిరువూరు, గంపలగూడెం, జగ్గయ్యపేట, నందిగామ, వత్సవాయి తదితర మండలాల్లోని వేలాది ఎకరాల్లోని మామిడి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఇప్పటికే అనేక సమస్యలతో సతమతమవుతున్న మామడి రైతులకు అకాల వర్షాలు శాపంగా మారగా, వారికి మరో సమస్య 'యూజర్ ఛార్జీల' రూపంతో ఎదురవుతోంది. ఆసియాలోకెల్లా అతి పెద్ద మామిడి మార్కెట్‌గా పేరుగాంచిన నున్న (విజయవాడ) మార్కెట్లో మామిడి వ్యాపారంలో లావాదేదీలకు యూజర్ ఛార్జీలు వసూలు చేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. వందకు ఒక శాతం యూజర్ చార్జీలు వసూలు చేయాలని మార్కెటింగ్ శాఖ నిర్ణయించినట్లు సమాచారం. గతంలో మార్కెటింగ్ శాఖ సెస్ వసూలు చేసేవారు. కరోనా కారణంగా దీనిని రద్దు చేశారు. అయితే వ్యవసాయ మార్కెట్ కమిటీలకు ఎలాంటి ఆదాయం రాకపోవడంతో ఒక శాతం యూజర్ ఛార్జీలు వసూలు చేయాలని మార్కెట్ కమిటీ నిర్ణయించినట్లు సమాచారం. అయితే దీన్ని మామిడి వ్యాపారాలు వ్యతిరేకస్తున్నారు. విజయవాడ నగరానికి అత్యంత సమీపంలో గల నున్న గ్రామంలో మామిడి మార్కెట్ ఉంది. నియోజకవర్గాల విభజనతో గన్నవరంలోకి వెళ్లింది. గన్నవరం ఎఎంసి వారు నున్న మార్కెట్‌పై ఇప్పటి వరకు ఎలాంటి శ్రద్ధ పెట్టలేదు.

వీక్షణం

ఉన్నట్టుండి యుజర్ చార్జీలు వసూలు చేయాలనే అంశాన్ని తెరపైకి తెచ్చారు. ఇది రైతుకు నష్టమని పలువురు భావిస్తున్నారు. దీనివల్ల మామిడి రైతులపై మరింతగా భారం పడే అవకాశం వుంది. ఇప్పటికే మామిడి రైతు నుంచి వివిధ పద్దుల కింద రెండు శాతానికిపైగా వ్యాపారులు కమీషన్ పేరుతో ఛార్జీలు వసూలు చేస్తున్నారు. దీనికితోడు పరోక్షంగా యూజర్ ఛార్జీలు రైతు నెత్తిన పడే అవకాశం లేకపోలేదు. సీజన్ ప్రారంభంలో నున్న మార్కెట్లో బంగినపల్లి రకం సైజును బట్టి టన్ను రూ.30 వేల నుండి రూ.60 వేల వరకు పలికేది. అకాల వర్షాలతో కాయ రాలిపోవడం, తెగుళ్ల ఉధృతం కావడంతో ప్రస్తుతం టన్ను రూ.5 వేల నుంచి రూ.25 వేలకు ఒక్కసారిగా పడిపోయింది. ఆకాలవర్షాలతో మామిడికి మంగు పట్టడం, చీడపీడలు ఆశించమే ఈ పరిస్థితికి కారణం. తెగుళ్ల, అకాల వర్షాలతో ప్రస్తుతం పెద్దగా నాణ్యత లేని సరుకే మార్కెట్‌కు వస్తోంది. ఫలితంగా ధర సగానికి సగం పడిపోయింది. గతేడాది నాణ్యమైన బంగినపల్లి రకం టన్ను ధర గరిష్టంగా రూ.90 వేలు పలికింది. అప్పుడు రెండో రకం టన్ను రూ.50వేలు దాకా పలికింది. ఈనెలాఖరు తర్వాత మంచి సైజుతో నాణ్యమైన మామిడి వస్తేనే డిమాండ్ ఏర్పడి, మంచి ధర లభిస్తుందనే ఆశతో రైతులు ఉన్నారు. కానీ యూజర్ ఛార్జీల రూపంలో తమపై పడే భారాన్ని రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ ఏడాది సీజన్ ఆరంభంలోనే ప్రతికూలతగా ఉన్న ప్రకృతికితోటు తాజాగా యూజర్ ఛార్జీలు మోపే ప్రయత్నం చేయడం సరికాదని మామిడి రైతులు వాపోతున్నారు. ఈ ప్రయత్నాలను విరమించుకోవాలని మామిడి రైతులు కోరుతున్నారు.

- దాసరి కామేశ్వరరావు